

## ఇద్దరు యువకుల మృతి బాధాకరం

### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

పిఠాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు వచ్చి రాజమహేంద్రవరం-కాకినాడ మధ్య గల ఏడీబీ రోడ్డు మీదుగా వెళుతూ ప్రమాదానికి గురై ఇద్దరు యువకులు మరణించడం బాధాకరమని.. ఈ సమాచారం తెలియగానే తీవ్ర ఆవేదనకు గురయ్యాయని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. మృతులు కాకినాడ సమీపంలోని గైగోలుపాడుకు చెందిన మణికంఠ, చరణ్ కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్టు ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల వంతున జనసేన పార్టీ తరఫున ఆర్థిక సహాయం అందజేస్తామని ఆయన ఎక్స్(ట్విటర్) ద్వారా ప్రకటించారు. ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందజేయాలని కార్యాలయ అధికారులకు సూచించినట్టు తెలిపారు. గేమ్‌చేంజర్ ఈవెం ట్‌లో ఇళ్లకు సురక్షితంగా వెళ్లాలని ఒకటికి రెండుసార్లుచెప్పిన విషయాన్ని గుర్తుచేశారు.

### ఇక నుంచి ఏడీబీ రోడ్డుపైనే పిఠాపురానికి

కాకినాడ-రాజమహేంద్రవరం నగరాల మధ్య ప్రయాణానికి కీలకమైన ఏడీబీ రోడ్డును గత ప్రభుత్వం ఐదేళ్లపాటు పట్టించుకోలేదని.. కనీసం నిర్వహణ పనులు చేయలేదని, విద్యుద్దీపాలు లేవని పవన్‌కల్యాణ్ విమర్శించారు. దీంతో ఈ రహదారిలో ప్రమాదాలు పెరిగాయని తెలిపారు. ఐదు నియోజకవర్గాలే కాక రెండు జిల్లాల మధ్య ప్రధాన రహదారిగా ఉన్న ఈ రోడ్డు పనులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి చేపట్టిందని చెప్పారు. అధ్వానంగా ఉన్న ఈ రహదారిని మెరుగుపరిచే పనులు జరుగుతున్న తరుణంలో ఇటువంటి ప్రమాదం జరగడం బాధ కలిగించిందని తెలిపారు. ఇక తాను పిఠాపురం నియోజకవర్గానికి వచ్చేటప్పుడు ఏడీబీ రోడ్డు మీదుగానే రాకపోకలు సాగించాలని నిర్ణయించుకున్నట్టు పవన్ ప్రకటించారు.

## 15.31 లక్షలు

### జిల్లాలో మొత్తం ఓటర్ల సంఖ్య

### మహిళా ఓటర్లే అధికం

### 7,72,156 మంది

### ఓటర్ల సవరణ తుది జాబితా విడుదల

అమలాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రత్యేక ఓటర్ల సంక్షిప్త సవరణ అనంతరం ఓటర్ల తుది జాబితాను ఇన్‌చార్జి డీఆర్వో కె.మాధవి సోమవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 15,31,161 మంది ఓటర్లు నమోదై ఉన్నారు. మహిళా ఓటర్లే అత్యధికంగా ఉన్నారు. 7,72,156 మంది మహిళా ఓటర్లు ఉంటే 7,58,984 మంది పురుషులు ఉన్నారు.

రామచంద్రపురం నియోజకవర్గం: పురుషులు 1,00,689 మహిళలు 1,02,500, ట్రాన్స్‌జెండర్ 1, మొత్తం: 2,03,190

ముమ్మిడివరం నియోజకవర్గం: పురుషులు 1,21,865, మహిళలు 1,22,920. మొత్తం 2,44,785.

అమలాపురం ఎస్సీ నియోజకవర్గం: పురుషులు 1,06,284 మహిళలు 1,07,260 ట్రాన్స్‌జెండర్ 1, మొత్తం: 2,13,545.

రాజోలు ఎస్సీ నియోజకవర్గం: పురుషులు: 97,852, మహిళలు: 1,00,172, ట్రాన్స్‌జెండరు ఒకరు... మొత్తం 1,98,025.

పి.గన్నవరం ఎస్సీ నియోజకవర్గం: పురుషులు: 99,942, మహిళలు 98,649, ట్రాన్స్‌జెండర్లు ఆరుగురు, మొత్తం 1,98,597.

కొత్తపేట నియోజకవర్గం: పురుషులు 1,25,177, మహిళలు 1,27,415, ట్రాన్స్‌జెండర్లు ఆరుగురు... మొత్తం 2,52,598.

మండపేట నియోజకవర్గం: పురుషులు 1,07,175, మహిళలు 1,13,237, ట్రాన్స్‌జెండర్లు ఆరుగురు... మొత్తం 2,20,418.

## ఆటలతో ఆరోగ్యం

### నేటి నుంచి మూడు రోజుల పాటు

### కోనసీమ క్రీడోత్సవాలు

### 22 మండల కేంద్రాల్లో ఆటల పోటీలు

### కలెక్టర్ మహేష్‌కుమార్ వెల్లడి

అమలాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు కోనసీమ క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. 'ఆటలతో ఆరోగ్యం' పేరిట జిల్లాలోని 22 మండల కేంద్రాల్లో 4, 5, 6 తరగతుల విద్యార్థులకు, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు వేర్వేరు విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు జరుగుతాయన్నారు. మండల స్థాయిలో విజేతలకు ఈ నెల 22, 23, 24 తేదీల్లో జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని, పిల్లల్లో మానసిక ఒత్తిడిని తగ్గించే లక్ష్యంతో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. నేటితరం పిల్లలు సెల్‌ఫోన్‌తోనే సమయం గడుపుతూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, వారిలో క్రమశిక్షణ, ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు జిల్లాస్థాయిలో ప్రభుత్వ, ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న బాలబాలికలకు వేర్వేరు విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. మండల స్థాయిలో ఆటలకు అనువుగా క్రీడా ప్రాంగణాలను తీర్చిదిద్దాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. 22 మండలాల్లో పోటీల నిర్వహణకు ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంఈవో లు, పాఠశాలల క్రీడల ఫెడరేషన్ కార్యదర్శులు ఇప్పటికే తగిన చర్యలు తీసుకున్నారనానరు. క్రీడా శిబిరాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి పోలీసు రక్షణ కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేస్తారు. క్రీడా ప్రాధికార సంస్థ పోటీలకు అవసరమయ్యే పరికరాలను వారి ద్వారా యంత్రాంగం ఇప్పటికే సంబంధిత మండలాలకు అందించిందని కలెక్టర్ చెప్పారు. మండల కేంద్రాల్లో జరిగే పోటీలను మండల ప్రత్యేకాధికారులు, నియోజకవర్గ స్థాయి అధికారులు ప్రతిరోజూ పరిశీలించి విజయవంతానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.



# రోడ్డు చేంజర్.. కూటమి

శరవేగంగా : సాగుతున్న ఏడీబీ రోడ్డు నిర్మాణపనులు

## కూటమి వచ్చింది.. ఏడీబీ రోడ్డు బాగుపడింది

**ప్రభుత్వం మారింది.. రోడ్డూ మారింది.. అదేమిటంటారా.. రోడ్లకు ప్రభుత్వానికి చాలా దగ్గర సంబంధం ఉంటుంది.. అది నిరూపించిందే.. రాజానగరం- సామర్లకోట ఏడీబీ రోడ్డు.. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు.. 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది.. అంతే రోడ్డుకు శని పట్టుకుంది.. ఐదేళ్లూ కదల్లేదు.. రోడ్లంతా గోతులే.. ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి.. ఎంతో మంది గాయాలపాల య్యారు. ఎన్నో వాహనాలు పనికిరాకుండా పోయాయి.. ఆ రోడ్డులో వెళ్లాలంటేనే భయపడేవారు.. మళ్లీ 2024 వచ్చింది.. ప్రభుత్వం మారింది.. వైసీపీ హయాంలో ఐదేళ్లు సాగని పనులు .. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పునఃప్రారంభమయ్యాయి.. ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పుడీ రోడ్డు సంగతెందుకంటారా.. శనివారం రాత్రి వేమగిరిలో జరిగిన గేమ్ చేంజర్ సినిమా ప్రీరిలీజ్ వేడుకకు హాజరై తిరిగి కాకినాడ వెళుతుండగా జరిగిన ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన ఈ రోడ్డుపై అందరి దృష్టి పడేలా చేసింది. సాక్షాత్తూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ రహదారి నిర్మాణంలో గత ప్రభుత్వ వైఫల్యం గురించి ప్రస్తావించారు. దీనిలో భాగంగా ప్రస్తుతం రోడ్డు నిర్మాణ పనులపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..**

- వైసీపీ హయాంలో ఐదేళ్లూ నరకమే
- వందలాదిగా ప్రమాదాలు
- గాలిలో కలిసిన ప్రాణాలు
- వేలాది మందికి గాయాలు
- పట్టించుకోని పాలకులు
- 2018లో పనులు ప్రారంభం
- ప్రభుత్వం మారి ఆగిన పనులు
- కూటమి ప్రభుత్వంలో దృష్టి
- శరవేగంగా నిర్మాణ పనులు
- శనివారం ప్రమాదంతో కదలిక

సామర్లకోట/రంగంపేట/రాజానగరం జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏడీబీ రోడ్డును తలచుకుంటే చాలు అటుగా తిరిగేవారెవరైనా అయ్యబాబోయ్ ఆ రోడ్డా అనకమానరు.. ఎందుకంటే అంత అధ్వానం.. గత ఐదేళ్లలో ఎంతో మంది ప్రాణాలను బలితీసుకున్న రోడ్డు అది. అయినా గత వైసీపీ ప్రభుత్వంలో కనీస చలనం లేదు. ఐదేళ్లు ఆ రోడ్డు గోతులతోనే నిండి ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో రోడ్డుకు మహర్దశ వచ్చింది.వేగంగా రోడ్డు నిర్మాణపనులు సాగుతున్నాయి. దీంతో ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం హైవే-కాకినాడ పోర్టుకు అనుసంధానం చేస్తూ రాజానగరం నుంచి కాకినాడ వాకలపూడి లైట్‌హౌస్ వరకూ ఏడీబీ (ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ రహదారి) రోడ్డును నిర్మించారు. 1991లో ఆసియా అభివృద్ధి బ్యాంకు నిధులతో ఈ రహదారిని 52 కిలోమీటర్ల మేర ఎంతో పటిష్టంగా నిర్మించారు.

### వై..చీప్ పాలన

గతంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రంగా ఉన్న కాకినాడ నుంచి వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలు పెరగడం, రాజమహేంద్రవరం ఎయిర్ పోర్టుకు ఈ రహదారి అనుసంధానమై ఉండడం వల్ల రోజురోజుకు వాహనాల రద్దీ పెరగడం వల్ల రాజానగరం నుంచి సామర్లకోట వరకు నాలుగు లేన్ల రహదారిగా అభివృద్ధి చేయాలని 2014లో టీడీపీ, బీజేపీ కూటమి ప్రభుత్వం ప్రతిపాదనలు తెచ్చింది. తదనంతరం 2018లో ఉమ్మడి జిల్లాలో రాజానగరం, రంగంపేట మీదుగా పెద్దాపురం, సామర్లకోట, రైల్వే వంతెన వరకు నాలుగు వరుసలుగా 30 కిలోమీటర్ల పొడవైన రహదారి నిర్మాణానికి నాబార్డు నిధులు రూ.300 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో కాంట్రాక్టర్ పనులు చేపట్టి కొంత వరకు పూర్తి చేశారు.మొత్తం రూ.250 కోట్ల వరకు నిధులు విడుదలయ్యాయి.2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత బిల్లులు మంజూరులో జాప్యంతో పనులు నెమ్మదించాయి.ఈ రహ దారి విస్తరణ పనుల్లో భాగంగా ఇరువైపులా లోతుగా తవ్విన ప్రాంతాల్లో గోతులు పూడ్చి పెట్టకుండా వదిలిపెట్టడంతో ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడిన ఘటనలు ఉన్నాయి. వాహనాలు అదుపుతప్పి రహదారిపై తిరగబడి ట్రాఫిక్ నిలిచి ప్రయాణికులు అవస్థలు చవిచూశారు. వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లు ఈ రహదారి నిర్మాణ పనులను పూర్తిగా గాలి కొదిలేసింది. దీంతో రహదారిపై ఏర్పడిన భారీ గోతులకు వాహనాలు ధ్వంసమైన దాఖలాలున్నాయి.ఎత్తు పల్లాల, గతుకుల కారణంగా ప్రయాణికులు ఈ రోడ్డుపై పడుతూ.. లేస్తూ ప్రయాణం సాగించక తప్పలేదు.ఎన్నికల ముందు అప్పటి సీఎం జగన్ ప్రచారయాత్ర ఈ ఏడీబీ రోడ్డు మీదుగానే సాగింది. నాడు రహదారి బాగుపడుతుందని అంతా ఆశించారు.కానీ కనీసం మరమ్మతు పనులు చేయకపోవడంతో వాహనదారుల్లో నిరాశే మిగిలింది. నిత్యం ఈ రహదారిపై ప్రయాణించే వివిధ కళా శాలలకు చెందిన విద్యార్థులు, ప్రయాణికులు నరకం చూశారు. కాకినాడ-రాజమహేంద్రవరం నాన్ స్టాప్ బస్సులు అనేకసార్లు ఈ రోడ్డులో గోతుల్లో ఇరుక్కుపోయిన ఘటనలు ఉన్నాయి. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రూ.45 కోట్ల మేర బిల్లులు చెల్లించకుండా కాంట్రాక్టర్లకు చుక్కలు చూపించింది. దీంతో వారు తీవ్ర నిరాశకు లోనై రోడ్డు నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆపేశారు. కాంట్రాక్టర్ యంత్రాలను తిరిగి తీసుకెళ్లిపోయారు.

నాడు దారి లేదు..



### కూటమి మార్పు ఇది..

కూటమి ప్రభుత్వం వచ్చింది.. వెంటనే రహ దారి నిర్మాణంపై దృష్టి సారించింది. రాజానగరం నుంచి సామర్లకోట వరకు నాలుగు లేన్లుగా నిర్మిస్తున్న ఏడీబీ రోడ్డు పనులు పెద్దాపురం, కోటపాడు, సూరంపాలెం ఆదిత్య దగ్గర పునఃప్రారంభించారు. ప్రస్తుతం గోతులతో వాహనాలు ప్రయాణం ఇబ్బందిగా ఉన్నచోట మరమ్మతులు చేపట్టారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అనపర్తి, రాజానగరం, జగ్గం పేట, పెద్దాపురం,కాకినాడ రూరల్ ఎమ్మెల్యేల చొరవతో సీఎం చంద్రబాబు పెండింగ్ బిల్లులు చెల్లించడంతో ఏడీబీ రోడ్డు పనులు పునః ప్రారంభించారు. ప్రస్తుతం పనులు కోటపాడు వద్ద శర వేగంగా సాగుతున్నాయి.ఎక్కడైనా చిన్న గొయ్యిపడినా వెంటనే పూడ్చివేస్తున్నారు.

నేడు దారి చూపుతున్నారు..





అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

## అర్జీల వెల్లువ

### అర్జీదారులు 1902కు కాల్‌చేసి ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చు: కలెక్టర్ మహేష్‌కుమార్



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాల మత్స్యకారులు

అమలాపురం టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అర్జీదారులు సార్వత్రిక ఫిర్యాదుల పరిష్కార హెల్ప్‌లైన్ ద్వారా తమ సమస్యలను నేరుగా తెలియజేసేందుకు ప్రభుత్వం వీలు కల్పించిందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. అర్జీదారులు నేరుగా 1902కు ఫోన్ చేసి ఫిర్యాదులు నమోదు చేసుకోవచ్చనన్నారు. అధికారులు తమ లాగిన్‌కు వచ్చిన సమస్యలను పూర్తిస్థాయిలో విచారించి సకాలంలో అర్జీదారుల సమస్యలకు పరిష్కార మార్గాలను పూర్తి నాణ్యతతో రీ ఓపెన్‌కు ఆస్కారం లేకుండా చేయాలన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మీ కోసం కార్యక్రమాన్ని జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకర ప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీరాణి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 218 అర్జీలు స్వీకరించారు. అర్జీ పరిష్కారం కాని పక్షంలో అర్జీదారులకు స్పష్టమైన కారణాలను తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఏ శాఖకు సంబంధించిన సమస్యను ఆ శాఖ వెబ్‌సైట్ ద్వారా పంపిస్తామన్నారు. సీపీవో వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు, పంచాయతీరాజ్ ఎస్‌ఈ పి.రామకృష్ణారెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా, జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజరు ప్రసాద్, లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజరు కేశవవర్మ, డీసీహెచ్ఎస్ కార్తీక్ రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీపీఆర్వో కె.లక్ష్మీనారాయణ, వికాస జిల్లా మేనేజరు గోళ్ల రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఎస్.యానాం బీచ్‌లో 13 నుంచి సంక్రాంతి సంబరాలు

### 16న ఓడలరేవులో కైట్ ఫెస్టివల్.... జబర్దస్త్ టీమ్‌తో సాంస్కృతిక ప్రదర్శనలు

### ఉత్సవాలను జయప్రదం చేయాలి: అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



వివరాలు వెల్లడిస్తున్న ఆనందరావు

అమలాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఉభయ రాష్ట్రాల నుంచి స్వస్థలాలకు తరలి వస్తున్న ప్రజల కోసం ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం సముద్ర తీరంలో మూడు రోజుల పాటు సంక్రాంతి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు వెల్లడించారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 13, 14, 15 తేదీల్లో ఎస్.యానాం బీచ్‌లో సంక్రాంతి ఉత్సవాలను, 16న ఓడలరేవులో కైట్ ఫెస్టివల్‌ను భారీస్థాయిలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇందుకోసం అమలాపురం నుంచి ఎస్.యానం వెళ్లే ప్రధాన రహదారిని అభివృద్ధి చేయడంతో పాటు ఎస్.యానంలోనే వన్‌వే అమలయ్యేలా రోడ్లను నిర్మిస్తున్నట్టు వెల్లడించారు. ఎస్.యానం గ్రామస్తులంతా చందాలు వేసుకుని వీటిని ఏర్పాటు చేస్తున్నారని, దాతలు కూడా సహకారం అందిస్తే అందరినీ అలరించే రీతిలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు తిరునాళ్లను తలపించేలా ఉత్సవాలు ఉంటాయన్నారు. మూడు రోజుల పాటు పాడుతాతీయగా,జబర్దస్త్ టీమ్‌లతో వినోద కార్యక్రమాలు జరుగుతాయన్నారు. బీచ్‌లో గుర్రపుస్వారీ, బీచ్ మోటారు సైకిళ్లు, ఉప్పుటేరులో విహరించేందుకు వాటర్ బైకులు ఏర్పాటు కానున్నాయన్నారు. విలేకరుల సమావేశంలో అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, పెచ్చెట్టి చంద్రమౌళి, టీడీపీ నాయకులు మల్లుల పోలయ్య, తిక్కిరెడ్డి నేతాజీ, దేశంశెట్టి లక్ష్మీనారాయణ, మీడియా కో-ఆర్డినేటర్ బోళ్ల సతీష్, జనసేన నాయకుడు నల్లా శ్రీధర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## కోనసీమ ప్రభల ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించాలి

### ప్రభల ఉత్సవ కమిటీ, ఇందుపల్లి

దేశంలో ఎక్కడా లేని విధంగా నిర్వహించే కోనసీమ ప్రభల ఉత్సవాన్ని స్టేట్ ఫెస్టివల్‌గా ప్రకటించాలని ప్రభల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు అర్జీ అందించారు. జగ్గన్నతోటలో జరిగే ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవం కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక గుర్తింపు దక్కించుకుంది. ప్రభల ఉత్సవాలను తిలకించేందుకు దేశ, విదేశాల నుంచి సైతం బంధువర్గీయులు, స్నేహితులు, పర్యాటకులు తరలివస్తుంటారు. ప్రభల ఉత్సవాలకు దేవదాయ శాఖ ఇస్తున్న నిధుల బడ్జెట్‌ను పెంచాలని, ప్రభల తీర్థాలు జరుగుతున్న ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, సీఎస్సార్ నిధులను ప్రత్యేకంగా కేటాయించాలని కలెక్టర్‌కు ఇచ్చిన అర్జీలో ప్రభల ఉత్సవ కమిటీ నిర్వాహకులు గిడుగు సుబ్బారాయుడు, ఆకెళ్ల నారాయణమూర్తి, వెంపరాల శ్రీరామచంద్రమూర్తి, వంక భాను తదితరులు కోరారు.



## మార్కెట్ విలువ ప్రకారం పరిహారం ఇప్పించాలి

### ఏడిద గ్రామ మంచినీటి చెరువుగట్టు గృహ నివాసులు, మండపేట మండలం



మా గ్రామంలోని మంచినీటి చెరువుగట్టును ఆనుకుని ఆరు దశాబ్దాలుగా 35 కుటుంబాలకు చెందిన వారు గృహాలు నిర్మించుకుని జీవిస్తున్నాం. మాకు గ్రామంలో గానీ, మరో ప్రాంతంలో గానీ ఏ విధమైన ఇళ్ల స్థలాలు, ఇళ్లు లేవు. గత 40 ఏళ్లుగా గృహాలకు ఇంటి పన్నులు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నాం. ప్రస్తుతం గ్రామాభివృద్ధిలో భాగంగా చెరువుగట్టున ఉన్న గృహాలను తొలగించేందుకు పంచాయతీ తరపున నోటీసులు ఇచ్చారు. లక్షలాది రూపాయలు అప్పు చేసి గృహాలు నిర్మించుకున్నాం. గ్రామాభివృద్ధికి మేము వ్యతిరేకం కాదు. కనీసం మా గృహాలకు, స్థలాలకు తగిన ధర నిర్ణయించి నష్టపరిహారమైనా ఇప్పించండి, ఇళ్ల స్థలాలు కేటాయించి గృహ నిర్మాణాలు జరిపి ఆదుకోవాలని మహిళలు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కలెక్టర్‌కు అర్జీ అందించారు.

## కూనవరం మొగను తెరిపించాలి

### ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాల మత్స్యకారులు

కూనవరం మేజర్ డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న మొగను తెరిపించి మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలంటూ ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాలకు చెందిన మత్స్యకారులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కూనవరం మేజర్ డ్రెయిన్ ద్వారా సుమారు 10 వేల మంది మత్స్యకారులు జీవనోపాధి పొందేవారన్నారు. ప్రస్తుతం ఆక్వా చెరువుల నుంచి కలుషిత వ్యర్థాలను డ్రెయిన్‌లోకి విడిచిపెట్టడం వల్ల పర్రలోని మత్స్య సంపద అంతరించిపోయిందని, మొగ తెరిపించడం వల్ల సముద్రపు ఆటుపోట్ల కారణంగా కాలుష్యం సముద్రంలోకి చేరి మత్స్య సంపద వచ్చి జీవనోపాధికి అవకాశాలుంటాయన్నారు. ఉపాధి లేక పస్తులుంటున్న మత్స్యకార కుటుంబాల పరిస్థితులను అర్థం చేసుకోవాలని మత్స్యకార సంఘ నాయకులు కలెక్టర్‌కు అర్జీ అందించారు.

## 'ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన'పై విస్తృత ప్రచారం చేయాలి: జేసీ

అమలాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా గృహ వినియోగదారుడే విద్యుత్ ఉత్పత్తిదారుడిగా మారే అవకాశం కలుగుతుందని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి పేర్కొన్నారు. అధిక ప్రయోజనాలు గల ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకుని ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. వినియోగదారులే తమకు నచ్చిన వెండర్ల ద్వారా సోలార్ గ్రూప్ టాప్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈపీడీసీఎల్ పరిధిలో విస్తృత ప్రచారం నిర్వహించి ఈ పథకంపై ప్రజలకు అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. కలెక్టరేట్‌లో ట్రాన్స్‌కో అధికారులతో నిర్వహించిన సమావేశంలో జేసీ మాట్లాడారు. ప్రస్తుతం ఉపయోగిస్తున్న విద్యుత్ తయారీలో 30 శాతం బొగ్గు ఆధారితంగా తయారవుతుందని తద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించాలన్న సంకల్పంతో కేంద్రం సూర్యఘర్ యోజన పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా వీటిని ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ పథకంతో కలిగే బహుళ ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించి సోలార్ విద్యుత్ వైపు వినియోగదారులను అడుగులు వేయించాలన్నారు. సోలార్ వల్ల విద్యుత్ బిల్లులు తగ్గించుకోవడంతో పాటు మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించి లాభాలు పొందవచ్చన్నారు. పట్టణాలు, గ్రామాల్లో సౌర ప్రాజెక్టులు ఏర్పాటు చేసే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఎస్ఈ ఎస్.రాజబాబు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



### యానాంలో ప్రజా ఉత్సవాలు ప్రారంభం

6, 8 పేజీల్లో



### ఎరుపెక్కిన కాకినాడ

యూటీఎఫ్ ఉపాధ్యాయుల భారీ ర్యాలీ... 7లో

# అట్టహాసంగా..



అకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



సీఎం రంగసామికి జ్ఞాపిక అందజేస్తున్న పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి

- యానాంలో ప్రజాఉత్సవాలు ప్రారంభం
- ఆకట్టుకున్న ఫల, పుష్ప ప్రదర్శన
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

యానాం, జనవరి 6: యానాం ప్రజాఉత్సవాలు, ఫలపుష్పప్రదర్శనలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడికృష్ణారావు ఆధ్వర్యంలో యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం ఈకార్యక్రమాలు నిర్వహించారు.వీటిని పుదుచ్చేరి సీఎం రంగసామి, స్పీకర్ సెల్వం, ఇతర మంత్రులు, అధికారులు ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విశాఖపట్నానికి చెందిన విక్టరీ ఈవెంట్స్ మేకర్స్ మేడిద విక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని శాస్త్రీయ, నృత్య పోటీలను నిర్వహించారు. యాంకర్ శాంతి తన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. టాటానగర్‌కు చెందిన చౌడాన్స్, ఒడిస్సాకు చెందిన కాంతారప్రదర్శన, కోల్‌కత్తాకు చెందిన ఇండియన్ టాలెంట్ విన్నర్, పల్సర్ బైక్ రమణ, విశాఖపట్నానికి చెందిన విజ్జు షాడో ఆకర్షించాయి. ప్రజలు తరలిరావడంతో జీఎంసీ బాలయోగి క్రీడామైదానం జనసంద్రంగా మారింది.

### ఫలపుష్ప ప్రదర్శన ప్రారంభం

జీఎంసీ బాలయోగి క్రీడామైదానంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 23వఫలపుష్ప ప్రదర్శన ప్రారంభమైంది. మల్లాడి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అశోక్ అధ్యక్షతన ముఖ్యమంత్రి ఎన్.రంగసామి, స్పీకర్ సెల్వం, మంత్రులు లక్ష్మీనారాయణ, జైకుమార్, తిరుమురుగన్, డిప్యూటీ స్పీకర్ రాజవేలు, ఎమ్మెల్యేలు అర్ముగం, లక్ష్మీకాంత్, ప్రకాష్, భాస్కర్, పరిపాలనాధికారి మునిస్వామి, వ్యవసాయశాఖ డీడీ జె.శివశుబ్రమణియన్ ఈ ఫలపుష్ప ప్రదర్శన ప్రారంభించారు. ఈ ప్రదర్శన మూడు రోజులపాటు జరగనుంది. ఎస్పీ రాజశేఖరన్ నేతృత్వంలో సీఐ షణ్ముగం గట్టి బందోబస్తును నిర్వహించారు. వీటిలో వివిధ రకాల జాతులు ఫలపుష్పాలను ప్రదర్శనకు ఉంచారు.



పూలు, పండ్లతో తయారు చేసిన గుర్రపు బండి



పూలతో జంతువుల ఆకారాల తయారీ





రోజా పూలతో ఐలవ్ యానాం



వివిధ రకాల పూల మొక్కల ప్రదర్శన

# హమ్మయ్య.. స్టెల్లా వెళ్లిపోయింది!





కాకినాడ సముద్ర జలాల్లో స్టెల్లా ఎల్ నౌక

- ఎట్టకేలకు కాకినాడ పోర్టు నుంచి బయలుదేరిన స్టెల్లా ఎల్ నౌక
- రేషన్‌బియ్యం ఎగుమతుల ఆరోపణలతో 55 రోజులపాటు నిలిచిన తొలినౌక

కలెక్టరేట్(కాకినాడ),జనవరి6(ఆంధ్రజ్యోతి: కాకినాడ సముద్ర తీరంలో లంగరు వేసుకుని 55రోజులపాటు నిలిచిపోయిన స్టెల్లాఎల్ పనా మానౌక సోమవారం తెల్లవారుజామున 2 గంటలకు బయలుదేరింది. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్ని అనుమతులు ఇవ్వడంతో నౌక పశ్చిమాఫ్రికలో బెనిన్ దేశానికి పయనమైంది. ఈ నౌక 26రోజులపాటు పయ నించి బెనిన్ దేశంలో కొటోనౌ పోర్టుకు చేరుకో నుంది. అక్కడ పోర్టులో ఇక్కడినుంచి తరలించిన బియ్యం అన్‌లోడింగ్ చేస్తారు. ఈనెల 31కి గమ్యం చేరుకుంటుందని నౌక అధికారులు వెల్లడించారు. దీంతో స్టెల్లాఎల్‌నౌక కథ సుఖాంతమైందని వారు అంటున్నారు.

నవంబరు 11న స్టెల్లా నౌక కాకినాడ సముద్రతీరానికి వచ్చింది. దీనిలోకి 32,415 మెట్రిక్ టన్నుల బియ్యం లోడింగ్ చేసిన తర్వాత రేషన్‌బియ్యం ఉన్నాయనే ఆరోపణలతో లోడింగ్ నిలిపివేశారు. తొలుత కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తనిఖీలు చేశారు. తర్వాత డిసెంబరు 4న అధికారుల బృందం తనిఖీలు చేశారు. 12శాంపిళ్లు సేకరించి వాటిని పరీక్షించి పీడీఎస్ బియ్యంగా నిర్ధారించారు. మొత్తంగా 1320మెట్రిక్ టన్నుల బియ్యం ఉన్నట్లు గుర్తించి వాటిని వారంరోజులపాటు శ్రమించి కాకినాడ పోర్టు ఒడ్డుకు చేర్చారు. అనంతరం ఈబియ్యం లోడింగ్ చేసిన సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌పై పౌరసరఫ రాలశాఖ 6ఏ కేసు నమోదు చేసింది. కాకినాడ పోర్టు పోలీస్‌స్టేషన్‌లో కూడా కేసు నమోదైంది. ఈ కేసు దర్యాప్తు జరుగుతోంది. తర్వాత ఎగుమతికి సిద్ధంగా ఉన్న 19,695 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని లోడింగ్ చేశారు. మొత్తంగా 52వేల మెట్రిక్ టన్నుల బియ్యం లోడింగ్ అవ్వడంతో సోమవారం తెల్లవారుజామున ఈ నౌక పశ్చిమాఫ్రికాకు వెళ్లిపోయింది.

### రేషన్‌బియ్యం వల్లే నిలిచిన నౌక

భారీనౌకలో రేషన్‌బియ్యం ఉన్నాయనే కారణంతో కాకినాడ సముద్రతీరంలో తొలిసారి ఒకనౌక 55రోజులపాటు నిలిచిపోయింది.గతంలో ఎప్పుడూ నౌకలు ఆగిపోయిన దాఖలాలు లేవని అధికారులు అంటున్నారు. దీనివల్ల ఎగుమతిదారులకు డెమరేజ్ చార్జీలు భారీగా పడ్డాయని చెప్తున్నారు. పైగా నవంబరు, డిసెంబరు నెలల్లో అధికశాతం రోజుల్లో తుఫాన్ల ప్రభావంవల్ల కూడా అన్‌లోడింగ్, లోడింగ్‌కు తీవ్ర ఆలస్యమైంది. అన్‌లోడింగ్‌కు బార్జిలు వెళ్లినప్పటికీ అల్పపీడనంవల్ల సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో వెనుదిరిగి వచ్చాయి. అనేక రోజులపాటు వాతావరణం అనుకూలించకపోవడంవల్ల రేషన్‌బియ్యం అన్‌లోడింగ్‌కు ఇబ్బందులు పడ్డారు.

### ఊపిరి పీల్చుకున్న అధికారులు

స్టెల్లా ఎల్ పనామా నౌక కాకినాడ తీరం నుంచి పశ్చిమాఫ్రికాకు వెళ్లడంతో కాకినాడ జిల్లా అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ప్రతిరోజూ నౌకలో రేషన్‌బియ్యం అన్‌లోడింగ్, తర్వాత లోడింగ్ సమాచారాన్ని ఎప్పటికప్పుడు పరిశీలన చేయాల్సి వచ్చేది. ఈ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అమరావతిలో ఉన్నతాధికారులకు చేరవేసేవారు. దీనిపై అధికారులు ప్రత్యేకంగా దృష్టిపెట్టి పనిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎట్టకేలకు నౌక వెళ్లిపోవడంతో హమ్మయ్య అనుకుంటున్నారు.

# షిర్డీ ఎక్స్‌ప్రెస్ రైలు.. సమయం మార్పుతో ప్రయాణికుల ఇబ్బంది

- సామర్లకోటలో సమయానికి చేరుకోలేకపోయిన 90మంది ప్రయాణికులు
- అధికారుల చొరవతో రాజమహేంద్రవరంలో మూడుగంటలపాటు నిలిపివేత

రాజమహేంద్రవరం సిటీ/సామర్లకోట, జనవరి 6( ఆంధ్రజ్యోతి): కాకినాడ నుంచి షిరిడీ వెళ్లే సాయినగర్ ఎక్స్‌ప్రెస్ రైలు రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్‌లో మూడుగంటలపాటు నిలుపుదల చేశారు. వారంలో రెండు రోజులపాటు కాకినాడ నుంచి షిరిడీకి సాయినగర్ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసు బయలుదేరుతుంది. ఈ రైలు గతంలో కాకినాడలో ఉదయం 6గంటలకు బయలుదేరేది. సామర్లకోట వచ్చేసరికి 6.15గంటలు అయ్యేది. కానీ, జనవరి 1నుంచి కొన్ని రైలు సర్వీసుల్లో సమయాల మార్పులు చేశారు. కాగా, సాయినగర్ రైలు సోమవారం ఉదయం 5:05గంటలకు కాకినాడ నుంచి బయలుదేరింది. 5.25గంటలకు సామర్లకోట చేరుకుని రాజమహేంద్రవరం వెళ్లిపోయింది. అంతకుముందు రిజర్వేషన్ చేసుకున్నవారికి టికెట్లలో పాత సమయమే ఉంది. దీంతో ప్రయాణికులు ఆ సమయానికి ఆలస్యంగా రైల్వేస్టేషన్లకు చేరుకున్నారు. ఇలా కాకినాడ రైల్వేస్టేషన్‌లో కొందరు, సామర్లకోట 95మంది ప్రయాణికులు ఉండిపోయారు. రైలు వెళ్లిపోయిందని తెలుసుకుని కాకినాడ, సామర్లకోట స్టేషన్లలో రైల్వే అధికారులను వారు నిలదీశారు. రిజర్వేషన్లు చేయించుకున్న ప్రయాణికులు రైల్వేస్టేషన్లలో ఉండిపోవడంతో రైల్వేఅధికారులు స్పందించి షిరిడీ ఎక్స్‌ప్రెస్‌ను రాజమహేంద్రవలో ఉదయం 6:15గంటలకు నిలపుదల చేశారు. వీరందరినీ కాకినాడ-తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలులో రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌కు తరలించారు. దీంతో ఉదయం 9గంటల సమయంలో రెండున్నర గంటల ఆలస్యంగా సిర్డీ ఎక్స్‌ప్రెస్ రైలు తిరిగి బయలుదేరింది. దీంతో బాధిత ప్రయాణికులు ఊరట చెందారు.

# వ్రత పురోహితులు సత్ప్రవర్తనతో మెలగాలి

- అన్నవరం ఈవో వీర్ల సుబ్బారావు

అన్నవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యదేవుడి ఆలయం పేరెత్తగానే గుర్తొచ్చేది సత్యనారాయణ స్వామి వ్రతమని వ్రతాలను నిర్వహించే పురోహితులు భక్తులపట్ల సత్ప్రవర్తనతో మెలిగి భక్తుల సందేహాలను విసుగు చెందకుండా నివృత్తి చేయాలని ఈవో వీర్ల సుబ్బారావు సూచించారు. సోమవారం ఆయన వ్రతపురోహిత సూపర్‌వైజర్లతో సమావేశమయ్యారు. ఆదివారం దేవదాయ కమిషనర్‌తో వీడియో కాన్ఫరెన్స్‌లో జరిగిన విషయాలను వారికి వెల్లడించారు. భక్తుల నుంచి ఆలయాలలో సమస్యలు, వారి అసంతృప్తి, తదితర అంశాలను ఐ.వి.ఆర్.ఎస్ కాల్స్ ద్వారా సేకరి స్తామని భక్తులను ఇబ్బందిపెట్టేలా ఎవరైనా వ్యవహరిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. కార్యక్రమంలో సహాయకమిషనర్ సీహెచ్ రామ్మోహనరావు, వ్రతపురోహిత సూపర్‌వైజర్లు చామర్తి కన్నబాబు, మందా శ్రీరామచంద్రమూర్తి, నాగాభట్ల రవిశర్మ పాల్గొన్నారు.



వ్రతపురోహిత సూపర్‌వైజర్లతో సమావేశమైన ఈవో సుబ్బారావు



ఆటో డ్రైవర్లు, యజమానులతో సమావేశమైన ఎస్.ఐ హరిబాబు, ఈఈ రామకృష్ణ

# ప్రతి ఆటోడ్రైవర్‌కు తిలకధారణ ఉండాలి

- దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ

రైలు, రోడ్డుమార్గం ద్వారా సత్యదేవుడి ఆలయానికి విచ్చేసే భక్తులను కొండదిగువ నుంచి కొండపైకి చేరవేసే ఆటో డ్రైవర్లు, యజమానులు తప్పనిసరిగా దేవాలయ నిబంధనల మేరకు తిలకధారణ నామం ఉండాలని దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ పేర్కొన్నారు. దేవదాయ కమిషనర్ ఆదేశాల నేపథ్యంలో సోమవారం రత్నగిరిపై వారితో సమావేశమయ్యారు. ఆటోలను ఉదయం 5గంటల నుంచి రాత్రి 9గంటల వరకు అనుమతిస్తామన్నారు. ఆటోలో ముగ్గురు భక్తులను మాత్రమే తీసుకెళ్లాలని, ప్రతిఆటోకు ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండడంతో పాటుగా యూనిఫాం ధరించడం, డ్రైవర్ పేరు, వారి ఫోన్‌నెంబరు యాత్రికులకు కనిపించేవిధంగా రాంచడం, భక్తులపట్ల మర్యాదగా ప్రవర్తించడం ఆటోలో ఎవరైనా భక్తుడు లగేజీ మరిచి పోయినట్లైతే దేవస్థానం అధికారులకు అప్పగించి తద్వారా భక్తులకు చేరేవిధంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో ఎస్‌ఐ హరిబాబు, సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్ రాజా, తదితరులు పాల్గొన్నారు.



## 10న సత్యదేవుడి ఉత్తరద్వార దర్శనం

- ఉదయం 5గంటల నుంచి సాయంత్రం 5 వరకు దర్శనభాగ్యం

అన్నవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని భక్తులకు ఈనెల 10న సత్యదేవుడి ఉత్తరద్వార దర్శనం కల్పించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఎప్పటిలాగానే ఒకే పర్యాయం మూలవరులను ఉత్తరద్వారంలో శ్రీ మహావిష్ణువు, లక్ష్మీదేవి అలంకారంలో భక్తులు దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్తరద్వార మార్గాన్ని వివిధ సుగంధభరిత పుష్పమాలికలతో అలంకరించనున్నారు. ఈఏడాది ఉత్తరద్వార దర్శన సమయాన్ని ఉదయం 5గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పెంచినట్లు ఈవో సుబ్బారావు తెలిపారు.

### విజయదుర్గా పీఠంలో పూజలు

రాయవరం, జనవరి6(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గ పీఠంలో 10న వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహించనున్నట్టు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పీఠంలో ఉన్న వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణతో భక్తులకు ఉత్తరద్వార దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. పీఠాధిపతి గాడ్ ప్రసంగిస్తారని తెలిపారు.

# సత్యదేవ స్మార్త, ఆగమ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నడుపుతున్న సత్యదేవ స్మార్త, ఆగమ పాఠశాల విద్యార్థులు తమ పాండిత్యంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రశంసాపత్రాలు పొందారు. హైదరాబాద్‌లో శ్రీ జనార్ధనానంద సరస్వతీ స్వామివారి ట్రస్ట్‌లో నిర్వహించిన ప్రవేశ, స్మార్తం, పంచదశ కర్మల మౌఖిక పరీక్షలు నిర్వహించగా హాజరైన 21 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈసందర్భంగా ఆగమ పాఠశాల విద్యార్థులను ఈవో వీర్ల సుబ్బారావు అభినందించారు. కార్యక్రమంలో ఆగమ పాఠశాల అధ్యాపకులు ఆరా ద్యుల లక్ష్మీ నరసింహమూర్తి ఏఈవో కొండలరావు ఉన్నారు.



స్మార్త ఆగమ పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న ఈవో సుబ్బారావు

# 'నన్నయ'లో ఫిబ్రవరి 5 నుంచి గిరిజన సాంస్కృతిక మహోత్సవం

దివాన్‌చెరువు, జనవరి 6: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 5, 6 తేదీల్లో జాతీయస్థాయి గిరిజన సాంస్కృతిక మహోత్సవం కార్యక్రమాలు జరుగుతాయని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. టీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి గిరిజన సాంస్కృతిక మహోత్సవం బ్రోచర్‌ను వీసీ సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునేందుకు జాతీయస్థాయిలో గిరిజన సాంస్కృతిక మహోత్సవాన్ని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. ట్రైబుల్ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు కరంసి అక్కులప్పనాయక్, రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, ప్రధాన కార్యదర్శి ముడవత్ విష్ణునాయక్, నిర్వాహకులుగా వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.సుధాకర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, అసిస్టెంట్ ప్రొఫెసర్ వరహాలదొర, అధ్యాపకులు రంజిత్‌నాయక్, సేలం హనుమంతు, విశ్వవిద్యాలయ టీఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.



జాతీయ గిరిజన సాంస్కృతిక మహోత్సవం బ్రోచర్‌ను ఆవిష్కరించిన వీసీ శ్రీనివాసరావు

# అమెరికాలో ఉంటున్నా.. పుట్టిన ఊరు గురుతే!

- మురమండలో ఆలయాభివృద్ధికి రూ.20 లక్షల విరాళం
- ఎన్‌ఆర్‌ఐ వెంకట్రావు దాతృత్వం

కడియం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఎక్కడున్నా.. ఎంత ఎత్తుకు ఎదిగినా పుట్టిన ఊరు.. కన్నతల్లిని మరువకూడదనేది మన పెద్దల మాట.. జిల్లాకు చెందిన ఒక ఎన్‌ఆర్‌ఐ అదే చేస్తున్నారు. పుట్టిన ఊరుకి తన వంతుగా సేవ చేస్తున్నారు. కడియం మండలం మురమండ గ్రామానికి చెందిన ముద్దుల వెంకట్రావు ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడ్డారు. తాను పుట్టిన ఊరుకి ఏదో ఒకటి చేయాలనేది ఆయన ఆశ. ఈ మేరకు సుమారు రూ.20 లక్షలుపైగా స్వీయ నిధులు ఇచ్చి గ్రామంలో సర్వకామదాంబ సోమేశ్వరస్వామి ఆలయంలో మండపం ఆధునీకరణ, గ్రానైట్, రంగులు, టైల్స్ వేయించాడు. అంతేకాకుండా పండితుల సలహా మేరకు సోమవారం దాత ముద్దుల వెంకట్రావు - సత్యదుర్గావాణి దంపతులు ముందుగా గణపతిపూజ, సర్వకామదాంబ సోమేశ్వరస్వామికి మహా త్రిపుర సుందరీ సమేత పంచ సహస్ర పార్థివలింగార్చన, అభిషేక హవన మహా రుద్ర కల్పం, శాంతి కల్యాణం చేశారు. ఈ పూజలో మట్టితో తయారు చేసిన 5 వేల శివలింగాలను ఉంచారు. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామివారి శాంతి కల్యాణం, హోమంవైభవంగా జరిగాయి. అనంతరం ఆలయంవద్ద అన్నసమారాధన ఏర్పాటుచేశారు. పూజలో గ్రామస్తులతోపాటు భక్తులు పాల్గొన్నారు.



సోమేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎన్‌ఆర్‌ఐ వెంకట్రావు, సత్యదుర్గావాణి దంపతులు

# రాచపల్లిలో డ్రోన్‌తో స్ప్రేయింగ్‌పై అవగాహన సదస్సు

- 22 జిల్లాల బృందం పరిశీలన

ప్రత్తిపాడు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ ద్వారా ప్రకృతి వ్యవసాయంలో భాగంగా జీవామృతం పంటలపై పిచికారీ చేయడంపై కాకినాడజిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. పంట పొలాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి సామర్లకోట వ్యవసాయ శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందుతున్న 22 జిల్లాల శిక్షణా బృందం విచ్చేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వైవీ గంగాధర్ మాట్లాడుతూ డ్రోన్ ద్వారా జీవామృతాలు పిచికారీ చేయడంవల్ల రైతు శ్రమ తగ్గడమే కాకుండా డబ్బులు, సమయం ఆదా అవుతుందన్నారు. ఈ సమావేశంలో స్టేట్ టిమేటిక్ లీడ్ జానకి, బుజ్జిబాబు, జిల్లా ఆర్డినేటర్ గణేష్, ఎంపీఎల్ఎంఎస్‌ఏలు, ప్రత్తిపాడు డివిజన్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొని రైతులు పలు అంశాలు వివరించారు. వ్యవసాయ క్షేత్రంలో రాష్ట్రస్థాయి ఎన్ఎంపీ షాప్ యజమానుల శిక్షణా కార్యక్రమంలో ఈ సదస్సు నిర్వహించారు.

# బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేత

కలెక్టరేట్(కాకినాడ), జనవరి 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.5లక్షల చెక్కులను కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ సోమవారం అందజేశారు. ఈనెల 4వతేదీన రాజమండ్రిలో జరిగిన గేమ్ చేంజర్ ప్రీ రిలీజ్ కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తుండగా రంగంపేటవద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కాకినాడ రూరల్ గైగోలుపాడుకు చెందిన మణికంఠ, అశోక్‌నగర్‌కు చెందిన చరణ్‌ల కుటుంబ సభ్యులకు ఆయన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేనపార్టీ తరఫున ఈ చెక్కులను అందజేశామన్నారు. బాధిత కుటుంబాలను అన్నివిధాలుగా ఆదుకుంటా మన్నారు. రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ మృతి చెందడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు.



బాధితులకు చెక్కులు అందిస్తున్న కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

# జాతీయ విద్యావిధానం వద్దు

- కాకినాడ యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలో వ్యతిరేకించిన మేధావులు, విద్యావేత్తలు
- ఉపాధ్యాయుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని ధ్వజం


సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎంఏ బేబీ, విద్యావేత్త బాల సుబ్రహ్మణ్యం


వేదికపై అతిథులకు జ్ఞాపికలు, మాట్లాడుతున్న ఏపీఎన్‌జీవో అధ్యక్షుడు శివారెడ్డి

కలెక్టరేట్ (కాకినాడ), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో జాతీయ విద్యా విధానం 2020 విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తుందని యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో మేధావులు, విద్యావేత్తలు వ్యతిరేకించారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహా సభల్లో రెండోరోజు సోమవారం జరిగిన విద్యా సదస్సుకు యూటీఎఫ్ అసోసియేట్ సురేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. సదస్సులో ప్రముఖ విద్యావేత్త, మాజీ ఫ్లోర్ లీడర్ వి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం 2020 వల్ల దేశంలో విద్యాభివృద్ధి కుంటుపడుతుందన్నారు. ఉపాధ్యాయుల హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కార్యదర్శి సీఎన్.భారతి మాట్లాడుతూ దేశంలో విద్య పూర్తిగా వ్యాపారం అయిపోందన్నారు. ప్రభుత్వాలు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. ఉపాధ్యా యులు సామాజికం, ఆర్థికంగా ఉన్నతంగా ఉన్నప్పుడే మంచి బోధన జరుగుతుందన్నారు. ఏపీఎన్‌జీవో అధ్యక్ష, కార్యదర్శులు శివారెడ్డి, విద్యాసాగర్ మాట్లాడుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయుల హక్కుల కోసం పోరాడుతుందన్నారు. ఏపీఎన్‌జీవో నాయకుడు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల ప్రభుత్వ పాఠశాల విద్య ధ్వంసమైందని, అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిపోయాయన్నారు. ప్రభుత్వం తక్షణమే జీవో 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, గోపిమూర్తి, ఇళ్ల వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే.నగేష్, చక్రవర్తి, రాష్ట్రకార్యదర్శులు మోహన్‌రావు, కిషోర్, మనోహర్, లక్ష్మీరాజ్యం, జ్యోతిబసు పాల్గొన్నారు.

## మహిళా సాహిత్య సదస్సు

యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల్లో సోమవారం ప్రత్యేకంగా మహిళా సాహిత్య సదస్సు జరిగింది. ఐక్య ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకుడు కుమార్‌రాజా అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావ్లే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. మార్కెట్ ప్రభావం నుంచి నేటి తరం బాలలను రక్షించుకోవాలన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ అమ్మ, ఏడుతరాలు,స్పార్టకస్ వంటి నవలలను ఉపాధ్యాయునులు చదవాలన్నారు. తద్వారా ఉపాధ్యాయులతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ చేతులు జోడించడం ద్వారా కాకుండా చేతులు బిగించడం ద్వారా అభివృద్ధి చెందు తామన్నారు. సాహిత్యం మనుషులను సంస్కరిస్తుం దన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ మాట్లాడుతూ సాహిత్యం మరో నవ సమాజాన్ని నిర్మిస్తుందన్నారు. అనంతరం అట్టాడ అప్పలనాయుడు రచించిన నక్షత్రబాట, కే.మోహన రచించిన చెమట చెక్కిన వాక్యం పుస్తకాలను ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐ.ప్రసాద్‌రావు, చిలుకూరు శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి నవ కోటేశ్వరరావులు వందన సమర్పన చేశారు.

# ఎరుపెక్కిన కాకినాడ!

## వేలాది మంది యూటీఎఫ్ ఉపాధ్యాయుల ర్యాలీ

యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం కాకినాడలో యూటీఎఫ్ ఉపాధ్యాయులు వేలాది మంది ర్యాలీ చేశారు. యూటీఎఫ్ జెండాలను పట్టుకుని ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందామని నినాదాలు చేశారు. ర్యాలీ కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల నుంచి మెయిన్ రోడ్డు మీదుగా జగన్నాథపురం బ్రిడ్జి మీదుగా బాలాజీ చెరువు సెంటర్ వరకు సాగింది. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రసాద్‌ల సారథ్యంలో ఈ ర్యాలీ విజయవంతంగా సాగింది. దీంతో కాకినాడ ఎరుపెక్కింది. దేశం నలు మూలల నుంచి వచ్చిన విద్యా వేత్తలు, మేధావులు, ఉపాధ్యాయులతో కిటకిటలాడింది. ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన డీఏలు, మెడికల్ లీవులు చెల్లించాలని నినాదాలు చేశారు. సరెండర్ లీవులు, పీఆర్సీ చెల్లించాలని డిమాండ్ చేశారు. 117 జీవోను రద్దు చేయాలని కోరారు. సీపీఎస్ రద్దు చేయాలని, ఓపీఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకుందామని నినాదాలు చేశారు. ప్రభుత్వ పాఠశాలలలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. భారీజెండాలు, డప్పులు వాయి ద్యాలతో కాకినాడ నగరం మారుమోగింది. అలాగే ఉద్యమ గీతాలు ఆలపించారు.

ర్యాలీకి ముందు వేదికపై ఉత్సాహంగా ఉపాధ్యాయులు




ర్యాలీలో పాల్గొన్న ఉపాధ్యాయులు

# గుడ్డు ఢమాల్!



- పడిపోయిన గుడ్డు ధర
- హోల్‌సేల్‌లో రూ.6.30 నుంచి రూ.4.50కు తగ్గిపోయిన వైనం
- మార్కెట్‌లో రూ.6 నుంచి రూ.7వరకు విక్రయం
- ఆవేదనలో కోళ్ల పరిశ్రమల నిర్వాహకులు

మండపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నిలకడలేని కోడి గుడ్డు ధరతో రైతులు డీలా పడుతున్నారు. ముఖ్యంగా గతేడాది నవంబరు, డిసెంబరులో గుడ్డు ధర ఆశాజనకంగా రూ.6.30పైసలకు చేరింది. ధర పెరిగిందన్న ఆనందం రైతుల్లో ఎంతోకాలం నిలవలేదు. కారణం గుడ్డు ధర అమాంతంగా పడిపోవడమే. ప్రస్తుతం గుడ్డు ధర మార్కెట్‌లో నూతన సవంత్సరం ప్రారంభంలోనే పడిపోయింది. ఇప్పుడు హోల్ సేల్ ధర రూ.4.75కి పడిపోయింది. విడిగా గుడ్డు ధర మార్కెట్‌లో రూ.6నుంచి రూ.7వరకు విక్రయిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే కోళ్ల పరిశ్రమ నిర్వాహణ భారంగా మారి మూతపడే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పెరిగిన ధర 5 నెలలపాటు**

నిలబడితే పరిశ్రమకు ఉపశమనం కలుగుతుందని నిర్వాహకులు చెబుతున్నారు. కోళ్ల మేతకు వినియోగించే ముడి సరుకు కొరత కూడా తీవ్రంగా ఉండడం తోపాటు వాటి ధర పెరగడంతో మోయలేని భారం పడుతుందని వాపోతున్నారు. ప్రస్తుతం శీతకాలంలో 3 నెలల పాటు గుడ్డు ధర నిలకడగా ఉంటుందని అనుకున్న కోళ్ల రైతులు ఆశలపై నూతన సవంత్సర ప్రారంభంలోనే నీళ్లు పడ్డాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మొత్తం 200వరకు కోళ్ల ఫారాలు ఉన్నాయి. వాటిలో 1.3కోట్ల మేర కోళ్లు ఉండగా వాటి నుంచి 1.10 కోట్లమేర గుడ్లు ఉత్పత్తవుతున్నాయి.

**60శాతం గుడ్లు మేర పొరుగు**

రాష్ట్రాలకు ఎగుమతులు అవుతుండగా ఇక్కడ ప్రజలకు 40 శాతం మేర సరఫరా చేస్తున్నారు. నవంబరు నుంచి ఫిబ్రవరి వరకు గుడ్డు ధర నిలకడగా ఉంటే కోళ్ల రైతులు నష్టాల బారి నుంచి కొంతమేర గట్టెక్కేవారు. కానీ ఇప్పుడు గుడ్డు ధర నిలకడగా లేకపోవటం వల్ల నష్టాలు తప్పవని కోళ్ల పరిశ్రమల నిర్వాహకులు చెబుతున్నారు. ప్రస్తుత కోళ్లపరిశ్రమ పరిస్థితి దయనీయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఈశాన్యరాష్ట్రాల్లో కోళ్ల పరిశ్రమలు పెరగడం కూడా ఇక్కడ రైతులపై ప్రభావం చూపిస్తుందని వారు చెబుతున్నారు.

# ఏపీ పేపరుమిల్లు లాకౌట్...ఎత్తివేత

- వేతనం పెంచాలని కార్మికుల డిమాండ్
- గత ఐదు రోజులుగా సమ్మె
- సోమవారం లాకౌట్ ప్రకటన
- రోడ్డెక్కిన 2 వేల మంది కార్మికులు
- ఫ్యాక్టరీ ఎదుట ఉద్రిక్తత
- లాకౌట్ ఎత్తివేయాలని కార్మికసంఘాల డిమాండ్
- దిగివచ్చిన యాజమాన్యం
- లాకౌట్ ఎత్తివేత ప్రకటన


పేపరుమిల్లు గేటు ముందు ధర్నా చేస్తున్న కార్మికులు

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆంధ్రప్రదేశ్ పేపరు మిల్లును మూసి వేశారు. నూతన వేతన ఒప్పందం చేయాలని ఆంధ్రప్రదేశ్ పేపరు మిల్లు కార్మికులు చేపట్టిన సమ్మెతో మిల్లు యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. మిల్లు కార్మికులు గత కొద్ది నెలలుగా నూతన వేతన ఒప్పందం కోసం నిరసనలు చేపట్టిన సంగతి విధితమే. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రెండు దఫాలుగా యాజమాన్య ప్రతినిధులు, కార్మిక యూనియన్లతో ప్రజాప్రతినిధులు, కలెక్టర్ ప్రశాంతి సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో కార్మికుల డిమాండ్‌ను యాజమాన్యం అంగీకరించలేదు. మిల్లులో రెగ్యులర్ కార్మికులు సుమారు 800మంది, కాంట్రాక్టు కార్మికులు 2 వేల మంది పనిచేస్తున్నారు. నూతనంగా కార్మికుడికి రూ.10,500లు పెంచుతూ వేతన ఒప్పందం చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. మిల్లు యాజమాన్యం రూ.3500 పెంచుతామని తెలియజేసింది. దీనికి కార్మికులు నిరాకరించారు. మిల్లు రూ.1200 కోట్ల లాభాల్లో ఉండగా కార్మికుల వేతనాలు పెంచడంపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని కార్మిక సంఘాలు మండిపడ్డాయి. ఈ మేరకు రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బత్తుల బలరామకృష్ణ సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు అమరావతిలో పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శితో సమావేశం నిర్వహించి కార్మికులకు న్యాయం చేయాలని, అందుకు ఒక కమిటీని వేయాలని ఆదేశించడం జరిగింది. ఈ మేరకు మిల్లులో గత ఐదు రోజులుగా సమ్మెలో ఉన్న కార్మికులకు ఆదివారం ప్రజాప్రతినిధులు మద్దతు ప్రకటించి విషయాన్ని తెలిపారు. గత కొద్ది నెలలుగా చేస్తున్న ఆందోళన కార్మికులు విరమించాలని.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పివెళ్లారు. అయినా కార్మికులు దిగిరాలేదు. దీంతో యాజమాన్య మొండి వైఖరి ప్రదర్శించింది. తెలారేసరికి అనుహ్యంగా పేపరుమిల్లు యాజమాన్యం మెయిన్ గేటుకు లాకౌట్ నోటీసులను అంటించి మిల్లును క్లోజ్ చేసింది. దీనిపై విస్మయం చెందిన కార్మికులు సోమవారం ఉదయం 6 గంటల నుంచే మిల్లు వద్ద ఆందోళనకు దిగారు. అగ్రిమెంట్ చేయమంటే దానిని చేయకుండా లాకౌట్ ప్రకటించిన యాజమాన్య వైఖరిని కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి. కార్మికులంతా రోడ్డెక్కడంతో పేపరుమిల్లు -సీతం పేట రోడ్డు కార్మికులతో బ్లాక్ అయ్యింది. సంఘటనా స్థలానికి భారీగా పోలీసులు చేరుకున్నారు. కార్మికుల ఆందోళన కొనసాగుతుంది. పేపరు మిల్లు కార్మికులకు అండగా కార్మిక సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు నిలిచారు. కార్మికుల ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. కార్మికులకు రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్ళ శిరామసుబ్రహ్మణ్యం, సీఐటీయూ, ఏఐటీ యూసీ నేతలు అరుణ్, కె.రాంబాబు మద్దతు తెలిపారు.

"పేపరుమిల్లు యాజమాన్యం దిగిరాకపోతే సహించేదిలేదు. 2రోజుల్లో యాజమాన్యం నుంచి సానుకూల ప్రకటన రాకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం" అని రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా హెచ్చరించారు.

## కూటమి ఎమ్మెల్యేల చొరవతో సమ్మె విరమించిన 9 యూనియన్లు

### లాకౌట్ ఎత్తివేసేందుకు అంగీకరించిన పేపరుమిల్లు యాజమాన్యం


ఆంధ్రప్రదేశ్ పేపరుమిల్లు కార్మికులు వేతన ఒప్పందం కోసం చేపట్టిన సమ్మెను 9 యూనియన్లు విరమించుకున్నాయి. కూటమి ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణల చొరవతో సోమవారం రాత్రి పరిశ్రమల శాఖ అధికారులను తీసుకుని కార్మిక సంఘాలు, మిల్లు యాజమాన్య ప్రతినిధులతో సుమారు గంటపాటు చర్చించారు. దీంతో 9 యూనియన్లు సమ్మెను విరమించేందుకు అంగీకారం తెలిపాయి. వెంటనే మిల్లు యాజమాన్యం కూడా లాకౌట్‌ను ఎత్తివేసేందుకు అంగీకరించింది. దీంతో పేపరుమిల్లు కార్మికులు మంగళవారం ఉదయం నుంచి విధులకు హాజరుకాబోతున్నారు. అయితే మొత్తం 11 యూనియన్లకు 9 యూనియన్లు సమ్మెను విరమించేందుకు అంగీకరించగా రెండు యూనియన్లు వ్యతిరేకించాయి. అయితే మిగిలిన ఆ రెండు యూనియన్ల వైఖరి మంగళవారం స్పష్టం కానుంది.

## హెచ్‌ఎంపీవీ వైరస్ కట్టడికి ముందస్తు చర్యలు

### కాకినాడ జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డు

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గతంలో కరోనా వైరస్‌తో కుదేలైన కుటుంబాలన్ని హమ్మయ్య అని పీడకల లాంటి జ్ఞాపకాల నుంచి తేరుకుంటున్న వేళలో మళ్లీ చైనాలోనే పుట్టి అక్కడి నుంచి వ్యాప్తి చెందుతున్న హ్యూమన్ మెటా న్యూమో వైరస్ (హెచ్‌ఎంపీవీ) తక్కువ ప్రమాదకరమైనదైనా వేగంగా వ్యాప్తి చెంది ఎక్కువ మందికి సోకే అవకాశం ఉన్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కాకినాడ జీజీహెచ్ (బోధనాసుపత్రి) లోని ఈఎన్‌టి విభాగంలో 22 పడకల సామర్థ్యం కలిగిన ప్రత్యేక వార్డును మంగళవారం ఏర్పాటు చేయనున్నట్టు ఆసుపత్రి సూపరింటెంట్ డా.ఎస్.లావణ్యకుమారి తెలిపారు. అయితే ఎప్పటికప్పుడు సబ్బుతో చేతులు కడుక్కోవడం, మాస్క్ ధరించడం, శానిటైజర్ వాడుతూ ముందస్తు స్వీయ పరిరక్షణ చర్యలు చేపడితే వైరస్ దరిచేరదని సూచించారు.

## రోడ్డు ప్రమాదంలో ఎంపీటీసీ మృతి


శ్రీరామమూర్తి (ఫైల్)

ముమ్మిడివరం/అయినవిల్లి జనవరి 6(ఆంధ్రజ్యోతి):మోటారుసైకిల్‌పై వెళ్తున్న ఎంపీటీసీ అదుపుతప్పి బోల్తా కొట్టిన సంఘటనలో మృతిచెందారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోన సీమ జిల్లా అయినవిల్లి మండలం క్రాప-శంకరాయగూడం ఎంపీటీసీ గుత్తుల శ్రీరామమూర్తి (68) సోమవారం ఇంటి నుంచి ముమ్మిడివరం వెళ్తుండగా మాగాం-అయినాపురం పంటకాల్వ గట్టు రోడ్డులో క్రాప చింతలపూడి సమీపంలో మోటారు సైకిల్ అదుపుతప్పి పక్కన ఉన్న చెట్టును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీరామమూర్తి భార్య సత్యవేణి గతంలో మృతిచెందగా ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. శ్రీరామమూర్తి గతంలో క్రాప-శంకరాయగూడెం సర్పంచ్‌గా పనిచేశారు. శ్రీరామమూర్తి మృతికి వివిధ పార్టీలకు చెందిన పలువురు సంతాపాన్ని వ్యక్తం చేశారు. శ్రీరామమూర్తి పార్థీవదేహానికి నాగవిజయలక్ష్మి, కుడుపూడి విద్యాసాగర్, మట్టపర్తి రామారావు, పెచ్చెట్టి రాంబాబు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## వివాహితకు ఏపీఎస్పీ కానిస్టేబుల్ వేధింపులు

### చర్యలు తీసుకోవాలంటూ పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా


సర్పవరంలో ధర్నా చేస్తున్న వివాహిత, బంధువులు

సర్పవరం జంక్షన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీ కానిస్టేబుల్ చనిబోయిన లోవరాజుపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం రాత్రి సర్పవరం పోలీస్‌స్టేషన్ వద్ద వివాహిత భర్త, బంధువులతో కలసి ధర్నా నిర్వహించారు. 3వ డివిజన్ గొడారిగుంటకు చెందిన యడాల సురేష్, దుర్గాశ్రావణి భార్యభర్తలు. సురేష్‌కు మావయ్య అయిన ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న చనిబోయిన లోవరాజు పక్క పోర్షన్‌లో నివాసం ఉంటున్నాడు. భర్త ఇంటిలో లేని సమయంలో అసభ్యంగా చేతులు వేస్తూ డబ్బులిస్తా కోరిక తీర్చాలని వేధిస్తున్నాడని కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాత్రి సర్పవరం పోలీస్‌స్టేషన్ వద్ద దుర్గాశ్రావణి ధర్నా చేపట్టింది. ట్రాఫిక్ స్తంభించడంతో సర్పవరం సీఐ బి పెద్దిరాజు, ఎస్ఐ ఏసుబాబు ఆందోళనకారులకు నచ్చచెప్పారు. కానిస్టేబుల్ లోవరాజుపై విచారణ చేపడుతున్నామని, ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తామని హామీఇచ్చి ఆందోళన విరమింపజేశారు. తనపై వేధింపులకు పాల్పడుతున్న కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని డిసెంబరు 31 రాత్రి ఫిర్యాదు చేసినా పోలీసులు ఎందుకు పట్టించుకోలేదని దుర్గాశ్రావణి, భర్త సురేష్ ప్రశ్నించారు. కానిస్టేబుల్ కావడంతో లోవరాజుని వెనకేసుకు వస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. వివాహిత ఫిర్యాదు మేరకు జనవరి 3న రసీదు ఇవ్వడం జరిగిందని, సోమవారం కానిస్టేబుల్ లోవరాజుపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు సీఐ పెద్దిరాజు తెలిపారు. దర్యాప్తు పూర్తి చేసి ఆరోపణలు వాస్తవమని తేలితే చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి

పెద్దాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురం నుంచి వాలుతిమ్మాపురం వెళ్లే రహదారిలో లలిత రైస్ ఇండస్ట్రీస్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. సామర్లకోట గణపతి నగరానికి చెందిన పెంకే అప్పారావు (65) బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ అదుపుతప్పి అతడిని ఢీకొనడంతో అప్పారావు అక్కడికక్కడే మృతిచెందాడు. అప్పారావు స్థానికంగా ఉన్న ఓ రైస్‌మిల్లులో పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ విషయంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

## రొయ్యల చెరువులో పడి వ్యక్తి మృతి

కరప, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కరపమండలం సిరిపురంలోని రొయ్యల చెరువులో పడి ఒక వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ తోట సునీత తెలిపిన సమాచారం మేరకు... కరపమండలం జి.బావారం గ్రామానికి చెందిన అయిత అప్పల ప్రభాకర ఆనందబాబు(59) సిరిపురంలో జనసేన నేత చిక్కాల దొరబాబుకు చెందిన రొయ్యల చెరువుల వద్ద పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం అతడు రొయ్యలకు మేత వేస్తూ ప్రమాదవశాత్తు ఫైబర్ బోటు నుంచి చెరువులో పడి మునిగిపోయాడు. అది చూసి పక్క చెరువులో పనిచేస్తున్న బోడపాటి దుర్గాప్రసాద్, ఊబా బుల్లిరాజులు చెరువులో దిగి ఆనందబాబును బయటకు తీసేసరికి అప్పటికే మృతిచెందాడు. ఘటనా స్థలికి చేరుకున్న కరప పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడి కుమారుడు సాగర్ ఇచ్చిన రిపోర్టు మేరకు కేసు నమోదు చేశారు.

## మధ్యవర్తిత్వంతో త్వరితగతిన ప్రయోజనం

### ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

### రాజమహేంద్రవరంలో మధ్యవర్తిత్వ తర్ఫీదు కార్యక్రమం ప్రారంభం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా సమయం వృథా కాదని, త్వరితగతిన ప్రయోజనం సమకూరుతుందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. రాజమహేంద్రవరంలోని జిల్లా న్యాయసేవాధికార సంస్థలో గంధం సునీత ఆధ్వర్యంలో 5 రోజుల పాటు జరిగే మధ్యవర్తిత్వ తర్ఫీదు కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. న్యాయమూర్తి సునీత మాట్లాడుతూ దీని వల్ల సామరస్యపూర్వకంగా కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ గాయత్రి దేవి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్‌బాబు, ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, విశాఖపట్నం, విజయనగరం జిల్లాలకు చెందిన 24 మంది అదనపు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్, జూనియర్ న్యాయమూర్తులు ఉన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ ప్రభాకరరావు మృతి


ప్రభాకరరావు (ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 6(ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ సీనియర్ జర్నలిస్ట్ జ్యోతుల ప్రభాకరరావు (62) సోమవారం మృతిచెందారు. లాలాచెరువులో నివాసం ఉంటున్న ఆయన ప్రస్తుతం ఒక ప్రధాన దినపత్రికలో సీనియర్ సబ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. తిలక్‌రోడ్డులోని వీఎల్‌పురం మలుపు వద్ద ఆదివారం సాయంత్రం ఒక యువకుడు ఆయన బైక్‌ను స్కూటీతో వేగంగా ఢీకొన్నాడు. దీంతో తలకు తీవ్రగాయాలపాలై ప్రైవేట్ ఆసుపత్రిలో చేరిన ఆయన కొద్దిసేపటికే కోమాలోకి వెళ్లిపోయారు. సోమవారం సాయంత్రం పరిస్థితి విషమించి తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు. 4 దశాబ్దాల పాటు పాత్రికేయుడిగా పలు పత్రికల్లో సేవలందించారు. ఆయన మృతి పట్ల ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి మండేల శ్రీరామ్మూర్తి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కుడుపూడి పార్థసారథి, పలువురు పాత్రికేయులు సంతాపం ప్రకటించారు. ప్రభాకరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

కాకినాడ క్రైం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ నియామక ఎంపిక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ప్రాథమిక రాతపరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆరో రోజైన సోమవారం కూడా కొనసాగాయి. మొత్తం 351 మంది పురుష అభ్యర్థులు హాజరు కాగా తదుపరి పరీక్షకు 278 మంది అర్హత సాధించారు. పరీక్షలను ఎస్పీ విక్రాంత్‌పాటిల్ స్వయంగా పర్యవేక్షించారు.


లాంగ్ జంప్‌ను పర్యవేక్షిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

# అమలాపురం



### నవోదయం పేరిట ప్రచారం

అమలాపురంరూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలనలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నవోదయం2.0లో భాగంగా సోమవారం రాత్రి కామనగరువులో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రచారం, అవగాహన సదస్సు నిర్వహించారు. సారా విక్రయిస్తున్నా, తయారుచేస్తున్నా సమాచారం అందించాలన్నారు.

### సురేంద్రకు ఆర్థిక సాయం

అంతర్వేది, జనవరి6(ఆంధ్రజ్యోతి): అంతర్వేది ప్రకాశపురానికి చెందిన చొప్పల సురేంద్ర ఎలక్ట్రికల్ పనిలో 16ఏళ్లక్రితం నడుముకుగాయంతో కాళ్లు పనిచేయక మంచానికే పరిమితమయ్యాడు. శ్రీనవోదయ ఎలక్ట్రికల్అండ్‌ప్లంబింగ్ అధ్యక్షుడు రాపాక చిన్ని, రాజమహేంద్రవరం ట్రాన్స్‌కో ఏఈ ముద్దూరి సతీష్ సోమవారం రూ.5వేలు అందించారు.

## విలువైన పులస సంపద ప్రాజెక్టుకు జాతీయ గుర్తింపు

అమలాపురం రూరల్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అత్యంత విలువైన పులస సంపద ప్రస్తుత పరిస్థితులు కొనసాగితే భవిష్యత్తులో అంతరించిపోయే ప్రమాదం ఉందని, అటువంటి సంపదను సంరక్షించుకునే విధానాన్ని వివరిస్తూ సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూలు విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు 31వ నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్‌లో అత్యుత్తమ ప్రదర్శనల్లో ఒకటిగా ఎంపికైంది. 15ఏళ్ల క్రితం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జాతీయ స్థాయిలో ప్రాజెక్టు గుర్తింపు పొందిందని, తిరిగి ఇన్నాళ్లకు మరోసారి ప్రతిష్టాత్మక గుర్తింపు లభించిందని జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం తెలిపారు. భోపాల్‌లో జరిగిన జాతీయ స్థాయి సైన్స్ కాంగ్రెస్ ప్రదర్శనలో దేశం నలుమూలల నుంచి 500కు పైగా ప్రాజెక్టులను ఉంచారు. వాటిలో అత్యుత్తమమైన 20 ప్రాజెక్టులను ఎంపిక చేయగా సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూలు విద్యార్థులు రూపొందించిన 'పులస.. డోంట్‌లెట్ అవర్ గెస్ట్ డిసప్పియర్' శీర్షికన ఎకో సిస్టమ్ బేస్డ్ అప్రోచ్ ఫర్ సెల్ఫ్ రిలయన్స్‌తో రూపొందించిన ప్రాజెక్టు అత్యుత్తమైన వాటిలో ఒకటిగా ఎంపికైంది. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్ డి.సుభారాణి, ప్రాజెక్టు రూపొందించిన విద్యార్థులు జి.చైతన్యదీపిక, ఎస్.రిషిమా చేసిన కృషిని అభినందిస్తూ సర్టిఫికెట్లతో పాటు చిల్డ్రన్ సైంటిస్టులుగా గుర్తించి అవార్డులను సోమవారం అందజేశారు. విద్యార్థులను, పాఠశాల యాజమాన్యాన్ని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా ప్రత్యేకంగా అభినందించారు.



భోపాల్‌లో జరిగిన జాతీయ సైన్స్ కాంగ్రెస్‌లో ఉత్తమ ప్రాజెక్టు అవార్డు అందుకుంటున్న చైతన్యదీపిక



## ఏళ్లు గడుస్తున్నా సమస్యలు పరిష్కరించరా..

- అధికారుల తీరుపై సభ్యుల ధ్వజం
- సంక్రాంతికి ముందే చెత్తతో భోగిమంటలు



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కుదుపూడి భాగ్యలక్ష్మి

అమలాపురం రూరల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు వైఫల్యం చెందుతున్నారని అధికార, విపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారినా అధికారుల తీరు మారట్లేదని, గత ప్రభుత్వంలో ప్రస్తావించిన సమస్యలను సైతం ఇప్పటివరకు పరిష్కరించని తీరుపై ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మండిపడ్డారు. అమలాపురం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ కుదుపూడి భాగ్యలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. బండారులంకలో డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించకపోవడంతో సంక్రాంతికి ముందే ప్రతి వీధిలోను, ప్రధాన రహదారుల్లోను ఎక్కడికక్కడ చెత్తతో భోగి మంటలు వేస్తున్నారని ఎంపీటీసీ అంకం హిమభారతి పేర్కొన్నారు. బండారులంక సర్పంచ్ పెనుమాలసునీత మాట్లాడుతూ డంపింగ్ యార్డు సమస్యకు పరిష్కారం దొరకట్లేదని, గ్రామస్తులు కొందరు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిందాడగరువులో లోఓల్టేజ్ సమస్యతో పాటు తరచూ విద్యుత్ అంతరాయంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి ఎన్నోసార్లు తీసుకువచ్చామని సర్పంచ్ పొణకల గణేష్ పేర్కొన్నారు. తాండవపల్లి, భట్నవిల్లి గ్రామాల్లోని శ్మశానవాటికల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేయాలని, సాకుర్రు అంబేడ్కర్‌నగర్‌లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఎంపీటీసీ రేవు శ్రీనుబాబు, సర్పంచ్ తిరుకోటి సుజాత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పొలమూరి బాలకృష్ణ విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గృహ నిర్మాణ శాఖ అధికారుల తీరుపై ఎంపీపీ భాగ్యలక్ష్మి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో గృహనిర్మాణ రుణాలు మంజూరు కాలేదని, ఇప్పుడూ అదే పరిస్థితి కొనసాగుతోందని అసహనం వ్యక్తం చేశారు. గృహ నిర్మాణ లబ్ధిదారులు రుణాల కోసం ఎంత కాలం ఎదురుచూడాలని ప్రశ్నించారు. పాలగుమ్మిలో డ్వాక్రా మహిళల నుంచి సేకరించిన నగదును వీవోఏలు బ్యాంకుకు జమ చేయకుండా స్వాహా చేశారని, ఈవ్యవహారంలో ఏపీఎం, ఇతర అధికారులపై చర్యలు తీసుకోవాలని పాలగుమ్మి సర్పంచ్ కుదుపూడి రామలక్ష్మి కోరారు. లక్షలాది రూపాయలు స్వాహా చేసినా ఎందుకు చర్యలు తీసుకోరని మండిపడ్డారు. బండారులంకలో జరిగిన నిధుల స్వాహాపై ఎందుకు చర్యలు తీసుకోలేదని సర్పంచ్ సునీత ప్రశ్నించారు. వన్నెచింతలపూడి లాకు వంతెన ప్రమాదకరంగా ఉందని, రక్షణ చర్యలు చేపట్టాలని కోఆప్షన్ సభ్యుడు ఎం.స్వర్ణన్‌రాజు కోరారు. ఎంపీటీసీలకు 23నెలలుగా జీతాలు లేవని, జీతాలు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఈదరపల్లి ఎంపీటీసీ అడపా సత్తిబాబు కోరారు. ఈవిషయంపై ఇప్పటికే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు లేఖ రాశామని ఎంపీపీ భాగ్యలక్ష్మి సమాధానమిచ్చారు. పంటకాల్వలు, మురుగుకాల్వ గట్లపై ఆక్రమణలు పెరిగిపోతున్నాయని, ఏళ్లు గడిచిపోతున్నా చర్యలు తీసుకోరా అని ఎంపీపీ, జడ్పీటీసీ పందిరి శ్రీహరిలు డ్రైన్స్ ఏఈ సునీత, ఇరిగేషన్ ఏఈ రెహ్మాన్‌లపై మండిపడ్డారు. కుమ్మరికాల్వపై ఆక్రమణలు పెరిగిపోతూనే ఉన్నాయని, అసలు వాటిని తొలగిస్తారా లేదా అని ఈదరపల్లి, పేరూరు ఎంపీటీసీలు సత్తిబాబు, వాసంశెట్టి శ్రీనివాసరావు ప్రశ్నించారు. సమస్యలను పరిష్కరించడంలో ఇరిగేషన్, విద్యుత్, మురుగు, సాగునీటిపారుదల శాఖల అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో వైస్ ఎంపీపీ అడపా సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో ఉండ్రు బాబ్జీరాజు, పంచాయతీరాజ్ డీఈ పీఎస్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### రూ.1.470లక్షల మిగులుబడ్జెట్

2024సవరణ బడ్జెట్, 2025-26అంచనా బడ్జెట్‌లో చూపిన ఆదాయాలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి అంచనా బడ్జెట్‌ను ఎంపీడీవో బాబ్జీరాజు ప్రవేశపెట్టారు. 2025-26 బడ్జెట్‌లో అన్నిపద్దుల కింద ఆదాయం రూ.109,56,78,000 కాగా వ్యయం రూ.109,55,31,000గా అంచనా వేశారు. రూ.1.47లక్షల మిగులు బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు.

## విద్యా విధానంలో సమూల మార్పులకు ప్రణాళిక



లైబ్రరీ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

ఉప్పలగుప్తం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో సమూల మార్పులకు మంత్రి నారా లోకేశ్ ప్రణాళిక రచిస్తున్నారని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. గొల్లవిల్లి హైస్కూల్లో పీఎంశ్రీ నిధులతో నిర్మించే డిజిటల్ లైబ్రరీ భవనానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా విధానం విద్యార్థులు ఇష్టంగా కష్టపడి చదివేలా ఉండాలన్నారు. డిజిటల్ లైబ్రరీ ద్వారా విద్యార్థులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చని చెప్పారు. ఎస్ఎంసీ ఛైర్మన్ వాలా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గాచిన్నా, జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, ఎంపీటీసీ దొనిపాటి బాలమ్మ, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అరిగెల నానాజీ, టీడీపీ వాణిజ్యవిభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, ఎంఈవోలు కె.కిరణ్‌బాబు, సత్తి సత్యకృష్ణ, హెచ్ఎం లంక రాణి, కూటమి నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఉప్పలగుప్తం పంచాయతీ కామరాజుపేటలో తాగునీటి కొరత నివారణకు 60వేల లీటర్ల నీటిని నిల్వచేసేలా సంపు నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సర్పంచ్ కడిమి చిన్నవరాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### ప్రతిభా పురస్కారాలకు పరీక్ష

మామిడికుదురు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పూర్వ విద్యార్థుల ట్రస్టు అందిస్తున్న పురస్కారాలకు పరీక్ష సోమవారం మామిడికుదురు హైస్కూలులో నిర్వహించారు. ఎనిమిది స్కూళ్లకు చెందిన 16మంది విద్యార్థులు ప్రతిభా పరీక్షకు హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.20వేలు విలువైన పురస్కారాలను త్వరలో అందిస్తామని పూర్వ విద్యార్థుల ట్రస్టు కార్యదర్శి మైలవరపు రవీంద్రనాథ్ తెలిపారు. హెచ్ఎం సీహెచ్ నిరంజని, డి.సత్యనారాయణ పాల్గొన్నారు.

### అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ

రాజోలు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అంధుల అక్షర ప్రదాత లూయిస్ బ్రెయిలీ అని రాజోలు ఎంఈవో ఎన్.మనోహరం పేర్కొన్నారు. బ్రెయిలీ జయంతి సందర్భంగా రాజోలు భవిత కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నిర్వహించారు. ఎంఈవో మనోహరం మాట్లాడుతూ బ్రెయిలీ తనకు అంధత్వం వచ్చిందని బాధపడకుండా అంధులు చదువుకోవడానికి ప్రత్యేక లిపి కనుగొన్నాడన్నారు. మరో ముఖ్య అతిథి, రాజోలు ఇన్‌చార్జి ఎంపీడీవో మామిడిశెట్టి వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ బ్రెయిలీ లిపి ఆధారంగా ఎంతోమంది అంధులు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారన్నారు. ఎంఈవో మనోహరం ఆర్థిక సహాయంతో భవిత కేంద్రంలోని 22మంది పిల్లలకు దుస్తులను ఎంపీడీవో అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఒ.అన్నపూర్ణ, ఐఈఆర్టీలు సుబ్బలక్ష్మి, అనిత, తల్లిదండ్రులుపాల్గొన్నారు.

## ఆంధ్రా అసోసియేషన్.. సంక్రాంతి సంబరాలు



ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఆంధ్రా అసోసియేషన్ సభ్యులు

మామిడికుదురు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా అసోసియేషన్ (మా) ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో నిర్వహించిన సంబరాల్లో అధిక సంఖ్యలో తెలుగువారితో పాటు ప్రవాస భారతీయులు పాల్గొని ఉత్సాహంగా గడిపారు. ముఖ్య అతిథులుగా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, మలేషియా ఇండియా ఐ కమిషన్ చాన్సలర్ అమృతదాసు పాల్గొన్నారు. వీరిని మా సభ్యులు దుశ్శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలతో సన్మానించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా చిన్నారులు హరిదాసు, సోదమ్మ, వివిధ రకాల పాత్రల్లో ఆకట్టుకున్నారు. వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. మా అధ్యక్షుడు శ్రీరామ్ బొలిశెట్టి, కోర్ కమిటీ సభ్యులు జగదీష్‌శ్రీరామ్, వెంకట్, శ్రీనివాస్ చవటపల్లి, కిరణ్ గుత్తుల, శారద, దీప్తి, కిశోర్, ప్రమీల, వెంకీ, స్వామి పాల్గొన్నారు.

## ఆక్వా రైతులకు ఇచ్చిన హామీని అమలు చేయాలి

### మంత్రి నారా లోకేశ్‌కు వినతి



ఐటీ మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆక్వా రైతు సంఘ నాయకులు


అమలాపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఆక్వా రంగం నాలుగేళ్లుగా అనేక సమస్యలతో ఛిన్నాభిన్నమైంది. తిరిగి కోలుకునేలా రైతులకు యూనిట్ ధర రూ.1.50కే ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ ఉభయ గోదావరి జిల్లాల ఆక్వా రైతుల ప్రతినిధులు ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. హామీ అమలు కోసం రైతులు ఎదురుచూస్తున్నారన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు గత ప్రభుత్వం ఎత్తివేసిన సబ్సిడీని పునరుద్ధరించాలని కోరారు. ఆక్వా రంగంలో దాదాపు 90శాతం మంది కౌలు రైతులే ఉండడం వల్ల ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని వివరించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గ పర్యటనకు వచ్చిన లోకేశ్‌ను ఏపీఐఐసీ ఛైర్మన్ మంతెన రామరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, ఆక్వా రైతు నాయకుడు దెందుకూరి సత్తిబాబురాజు, రొయ్యల రైతుల ఫెడరేషన్ అధ్యక్షుడు నంబూరి గజపతిరాజు, కార్యదర్శి జీకేఎఫ్ సుబ్బరాజు, సంయుక్త కార్యదర్శి యువరాజు, పేరిచర్ల సత్యనారాయణ రాజు కలిసి అర్జీ అందించారు.

## యానాం అభివృద్ధికి సహకారం అందిస్తా: సీఎం

### పుదుచ్చేరి సీఎం ఎన్.రంగసామి

### యానాం ప్రజా ఉత్సవాలు ప్రారంభం







మాట్లాడుతున్న సీఎం రంగస్వామి, మల్లాడి కృష్ణారావు, జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దృశ్యం





యానాం, జనవరి 6: యానాం ప్రజలపై ఉన్న అభిమానంతోనే రోడ్డు మార్గంలో ఇంత దూరం వచ్చానని పుదుచ్చేరి ముఖ్యమంత్రి ఎన్.రంగసామి అన్నారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అధ్యక్షతన జరిగిన ప్రజా ఉత్సవాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎం రంగసామి పాల్గొన్నారు. కార్యక్రమంలో స్పీకర్ సెల్వం, మత్స్యశాఖమంత్రి లక్ష్మీనారాయణ, వ్యవసాయ శాఖ మంత్రి జైకుమార్, పౌర సరఫరాల శాఖ మంత్రి తిరుమురుగన్, డిప్యూటి స్పీకర్ రాజవేలు, ఎమ్మెల్యేలు ఏకేడీ అర్ముగం, లక్ష్మీకాంత్, ప్రకాష్, భాస్కర్, పరిపాలనాధికారి మునిస్వామి, వ్యవసాయశాఖ డీడీ జె.శివశుబ్రమణియన్ తదితరులు హాజరయ్యారు. ఈసందర్భంగా సీఎం రంగసామి మాట్లాడారు. సామాన్య ప్రజలకు ఏదోఒకటి చేయాలన్నదే నా తపన అన్నారు. నేను యానానికి ఏమీ చేసానన్నది యానాంలో అభివృద్ధి పనుల శిలఫలకాలను చూస్తే అర్థమవుతుందన్నారు. పుదుచ్చేరి, కారైకాల్, మహే, యానాంలోని అన్నిప్రాంతాలు నాకు సమానమేనన్నారు. ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తీసుకువచ్చిన ఎంత కఠినమైన సమస్యలైనా నెరవేర్చి తీరుస్తున్నాన్నారు. యానాం వేంకటేశ్వరస్వామి ఆలయ త్రీడీ నమూనా వీడియో చూసిన వెంటనే చాలా ఆనందం కలిగిందన్నారు. యానాం అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, యానానికి మరింత అభివృద్ధికి తగిన సహకారం అందిస్తానన్నారు.

### పుష్కరాలకు రూ.10కోట్లు ఇవ్వండి

### సీఎంను కోరిన ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, జనవరి 6: వచ్చే పుష్కరాలకు పుదుచ్చేరి ప్రభుత్వం నుంచి రూ.10కోట్లు కేటాయించాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. యానాం ప్రజా ఉత్సవాల్లో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ముఖ్యంగా యానానికి నాలుగేళ్లుగా సీఎం రంగసామి ఎన్నో అభివృద్ధి పనులు చేశారని, ఇంకా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరలోనే పరిష్కరించాలని కోరారు. 2012లో పుష్కరాలు యానాంలో ఎంతో ఘనంగా నిర్వహించామన్నారు. యానాంలో వెంకన్న ఆలయం నిర్మాణానికి టీటీడీ రూ.3కోట్లు కేటాయించిందని, మిగిలిన పనులు దాతల సహకారంతో రూ.4కోట్లతో చేపడతామన్నారు. రెండోవిడతలో రూ.8కోట్లు ఖర్చు అవుతుందని, ప్రభుత్వం రూ.3కోట్లు ఇస్తే, మిగిలిన రూ.5కోట్లు దాతల నుంచి సేకరి స్తామన్నారు. మల్లాడి పత్రాన్ని సీఎం, మంత్రులకు అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మాట్లాడారు. పుదుచ్చేరి నుంచి వచ్చిన సీఎం, ఇతర మంత్రులకు అభినందనలు తెలిపారు. తాను కూడా పుదుచ్చేరి నుంచి వచ్చిన అతిథిలా ఉన్నానని, తాను సభ అధ్యక్షుడిని అనేవిషయం ఇప్పటివరకుతెలియదన్నారు. అతిథులను గౌరవించుకోవాలి, ఇంకా మాట్లాడాల్సిన అంశాలను ఇతర వేదికలపై మాట్లాడతానని, తాను యానాం ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం అమలుచేయాలని కోరారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ

అమలాపురం టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగులరాష్ట్ర సంఘం రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా శాఖ అధ్యక్షురాలు వి.రాజామణి, సాధారణ కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు, కోశాధికారి జి.రవీంద్రబాబు, రాష్ట్ర సాధారణ కార్యదర్శి ఎం.త్రినాథ్, ఏపీవో వి.శ్రీనుబాబు, సునీత, పల్లయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### కోనసీమ క్రీడోత్సవాలు జరిగే ప్రాంగణాలు ఇవే..

అమలాపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): కోనసీమ క్రీడోత్సవాలు నిర్వహించేందుకు 22ప్రాంగణాలను ఎంపిక చేశారు. వాటిలో... అయినవిల్లి మండలం ముక్తేశ్వరం జడ్పీ హైస్కూలు, ఆలమూరు మండలం కొత్తూరు జడ్పీ హైస్కూలు, అమలాపురం బాలుర జడ్పీ హైస్కూలు, అంబాజీపేట జడ్పీ హైస్కూలు, ఆత్రేయపురం ఎంజీఆర్ జూనియర్ కళాశాల, ఐ.పోలవరం జడ్పీహెచ్ఎస్, కె.గంగవరం మండలం పామర్రు జడ్పీహెచ్ఎస్, కపిలేశ్వరపురం జడ్పీహెచ్ఎస్, కాట్రేనికోన జడ్పీహెచ్ఎస్ క్రీడా ప్రాంగణాల్లో పోటీలు జరుగుతాయి. కొత్తపేట ప్రభుత్వ పాఠశాల, మలికిపురం మండలం బట్టేలంక జడ్పీహెచ్ఎస్, మామిడికుదురు జడ్పీహెచ్ఎస్, మండపేట ప్రభుత్వ పాఠశాల, ముమ్మిడివరం జడ్పీహెచ్ఎస్, పి.గన్నవరం, రావులపాలెం, రాయవరం, రాజోలు జడ్పీహెచ్ఎస్ క్రీడా ప్రాంగణాలు, రామచంద్రపురం ఎస్కేవీజీఎస్ ప్రభుత్వ హైస్కూలు, సఖినేటిపల్లి మండలం మోరి జడ్పీహెచ్ఎస్, ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి జడ్పీ హైస్కూలు క్రీడాప్రాంగణాల్లో జరిగే పోటీలకు సమన్వయకర్తలను నియమించారు.

### నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

అమలాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ఈనెల7,8 తేదీల్లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్టు జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రాజబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎం.రవికుమార్, కె.రత్నాలరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7,8తేదీల్లో విజయవాడ బృందావనకాలనీలోని ఎ.కన్వెన్షన్ సెంటర్‌లోను, 10న కర్నూలు ఏపీఈఆర్సీ కార్యాలయంలోను ప్రజాభిప్రాయణ సేకరణ జరుగుతుంది. ఉదయం 10.30నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వ్యక్తిగతంగా, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4.30 వరకు వీడియో కాన్ఫరెన్సు నిర్వహిస్తారు. డిస్కమ్‌ల టారిఫ్ ఫైలింగ్‌కు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలు స్వీకరిస్తారని, ప్రతిపాదిత రిటైల్ ధరలపై సూచనలు ఇచ్చేందుకు విద్యుత్ వినియోగదారులు పాల్గొనవచ్చునన్నారు. జిల్లాలోని సూపరింటెండెంట్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయాల్లో ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.

### క్రీడోత్సవాన్ని విజయవంతం చేయండి

అల్లవరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కొమరగిరిపట్నం న్యాపతి సుబ్బారావుపంతులు జడ్పీ హైస్కూలులో ఈనెల7, 8, 9తేదీల్లో నిర్వహించే కోనసీమ క్రీడోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ కోరారు. అల్లవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో విద్యా శాఖ, పీడీలు, పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఎంఈవో-2 ఎస్.ఏడుకొండలు, పీడీ ఉండ్రు సత్యవెంకట ముసలయ్య, పంచాయతీ కార్యదర్శులు చిక్కం శ్రీనివాస్, ఎస్.రాజమోహన్, ఎస్.దుర్గాశ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

### 29 మందికి ఉద్యోగాలు

ముమ్మిడివరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కార్యాలయ ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల సమావేశ మందిరంలో జరిగిన జాబ్‌మేళాలో 29మంది ఎంపికయ్యారు. ఈజాబ్‌మేళాకు నాలుగు కంపెనీల హెచ్‌వోడీలు హాజరయ్యారు. 71మంది హాజరుకాగా 29మందిని ఎంపిక చేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు, డీపీవో రాజేంద్ర, స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ శ్రీదేవి, జిల్లా నైపుణ్యాభివృద్ధి ఉపాధి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### నాగజ్యోతికి ఉత్తమ కవితా పురస్కారం



ఐ.పోలవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఐ.పోలవరం మండలం మురమళ్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, రచయిత్రి, కవయిత్రి దొండపాటి నాగజ్యోతిశేఖర్‌కు సిరికోన సాహితీ అకాడమీ, తెలంగాణ సాంస్కృతిక సౌజన్యంతో కిన్నెరఆర్ట్స్ అకాడమీ ఉత్తమ పురస్కారాన్ని ప్రకటించింది. అకాడమీ సప్తమ సాహిత్యోత్సవం సందర్భంగా మరిగంటి ఆసూరిసులోచన రంగాచార్య స్మారక 2024- సిరికోన ఉత్తమ పురస్కారాన్ని ప్రకటించినట్టు నాగజ్యోతి తెలిపారు. రవీంద్రభారతిలో ఈనెల12న ఈపురస్కారాన్ని అందుకోనున్నట్టు వివరించారు. నాగజ్యోతిని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, వీధి సురేష్‌బాబు, ఉందుర్తి వెంకట్రావు అభినందించారు.

### నేటి నుంచి క్రీడలు ప్రారంభం

ముమ్మిడివరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): కోనసీమ క్రీడోత్సవాలు, ఆటలతో ఆరోగ్యం కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో ఈనెల7,8,9 తేదీల్లో ప్రాథమిక, మండలస్థాయిలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, కోకో, వాలీబాల్ క్రీడోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య తెలిపారు. ముమ్మిడివరం జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈఆటల పోటీలు నిర్వహిస్తావన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల నుంచి విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈక్రీడలకు హాజరు కావాలన్నారు.

### క్రీడా పోటీలను పకడ్బందీగా నిర్వహించాలి

మామిడికుదురు, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మామిడికుదురు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుంచి జరిగే క్రీడా పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు సూచించారు. క్రీడా పోటీలకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ ఐదు క్రీడాంశాల్లో జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో మూడు రోజులు పోటీలు జరుగుతాయని, అధికారులు సమన్వయంతో పనిచేసి క్రీడా పోటీలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### మధ్యాహ్న భోజన పథకం తనిఖీ

అంతర్వేది, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి గీతా మందిరం జిల్లా పరిషత్ హైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రధానోపాధ్యాయుడు వీరాస్వామితో కలిసి ఎస్ఎంసీ ఛైర్మన్ కొండా కిశోర్ సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం పాఠశాలలకు అనేక వసతి సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. విద్యార్థులకు మంచి చదువుతో పాటు మానసిక ఉల్లాసం కలిగించే క్రీడలు కూడా నిర్వహించాలని కోరారు. ఎస్ఎంసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### నీటి సంఘం అధ్యక్షుడికి సన్మానం

మలికిపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మలికిపురం నీటి సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన తిరుమల సుబ్బారావు (బాబి)ని గుడిమెళ్లంక తెలగ సంక్షేమ సంఘ సభ్యులు సన్మానించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో సుబ్బారావు మాట్లాడుతూ ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, సెంట్రల్ డెల్టా ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్, డీసీ పిశెట్టి బుజ్జి సహకారంతో కాల్వల మరమ్మతులకు అధిక ప్రాధాన్యత ఇస్తానన్నారు. సుబ్బారావును సంఘ సభ్యులు దుశ్శాలువాతో సన్మానించారు. తిరుమల గవర్రాజు, ముత్యాల శ్రీనివాస్, తోట వెంకటశ్రీనివాస్, టి.బాబులు, ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### కుమారుడికి గుర్తుగా జామ మొక్కల పంపిణీ

మలికిపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మలికిపురం మాజీ సర్పంచ్ గుబ్బల సత్యనారాయణ కుమారుడు విశ్వేశ్వరరావు ఇటీవల మృతి చెందాడు. అతడి జ్ఞాపకార్థంగా కుటుంబ సభ్యులు జామ మొక్కలను పంపిణీ చేసి ఆదర్శంగా నిలిచారు. మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్, గెడ్డం తులసీభాస్కర్, కాకి లక్ష్మణ్, నల్లి శివ,బొక్కా గోవిందు పాల్గొన్నారు.

### నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

మామిడికుదురు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి విజయనగరానికి చెందిన చింతపల్లి ఆదిత్య-అఖిల దంపతులు రూ.లక్ష విరాళాన్ని సోమవారం అందించారు. దాత దంపతులకు ఆలయ అర్చకులు శేషవస్త్రంతో సత్కరించి వేదాశీర్వచనం చేశారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించి దాతలను ఏసీ ఎం.సత్యనారాయణరాజు అభినందించారు.

### అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మురమళ్ల శ్రీభద్రకాళీసమేత వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు బెంగళూరుకు చెందిన గరిమెళ్ళ అవినాష్ సోమవారం రూ.10వేలు విరాళాన్ని ఆలయ పర్యవేక్షణాధికారి కటారి శ్రీనివాసరాజుకు అందించారు. దాతకు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామి చిత్రపటం, ప్రసాదం అందించి సత్కరించారు.

### గ్రీవెన్స్ ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

అంబాజీపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారులు అందించే ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించేందుకు కృషిచేయాలని అధికారులకు ఎంపీడీవో జీవీ సరోవరరావు, తహశీల్దారు జి.వెంకటేశ్వరి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్‌కు 5అర్జీలు వచ్చిన్నట్లు ఎంపీడీవో తెలిపారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### వాలీబాల్ క్రీడా మైదానం ఆధునికీకరణ ప్రారంభం

ఉప్పలగుప్తం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లిలో జాతీయ వాలీబాల్ పోటీలు నిర్వహించే క్రీడా మైదానం ఆధునికీకరణ పనులకు సోమవారం భూమి పూజ చేశారు. ఏఎస్ఆర్ జాతీయ ఇన్విటేషన్ వాలీబాల్ పోటీలు నిర్వహించే ఆటస్థలాన్ని ఏఎస్ఆర్ టోర్నమెంటు గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పరిశీలించారు. టోర్నమెంటు అధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శి గొలకోటి ఫణీంద్రకుమార్ ఆట స్థలం ఆధునికీకరణ, గ్యాలరీ నిర్మాణం, ఇతర ఏర్పాట్లపై ఎమ్మెల్యేతో చర్చించారు. కార్యక్రమంలో టోర్నమెంటు ప్రధాన కార్యదర్శి అరిగెల వెంకటనరసింహారావు, ముఖ్య సలహాదారు అరిగెల నానాజీ, సాంకేతిక సలహాదారు ఫుండ్రు రాజబాబు, ఉపాధ్యక్షులు మద్దింశెట్టి సురేష్, సలాది నాగరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### ఎస్పీ కార్యాలయంలో 19 అర్జీలు స్వీకరణ



అమలాపురం టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 19అర్జీలను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలను విని, వాటి పరిష్కారానికి ఆయా పోలీసుస్టేషన్ల పరిధిలోని అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.

### పీఏసీఎస్‌ల అధ్యక్షులు, డైరెక్టర్ల ఎంపిక

ముమ్మిడివరం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు సంబంధించి ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సూచనల మేరకు సహకార సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్ల ఎంపికను కూటమి నాయకులు పూర్తిచేశారు. ముమ్మిడివరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా దొమ్మేటి రమణకుమార్, డైరెక్టర్లుగా నిమ్మకాయల విశ్వేశ్వరరావు, యలమంచిలి బాలరాజు, అనాతవరం పీఏసీఎస్ అధ్యక్షుడిగా గొలకోటి వీరవెంకటశివరామకృష్ణ (దొరబాబు), డైరెక్టర్లుగా ఉందుర్తి వెంకటలక్ష్మి, కోట శ్రీనివాసరావులను ఎంపిచేశారు. కొమానపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడిగా పొద్దోకు నారాయణరావు (బాలు), డైరెక్టర్లుగా కేవీఎస్ఎన్ మూర్తి, కుంచనపల్లి రామాంజనేయులు, కొత్తలంక పీఏసీఎస్‌కు సంబంధించి పెద్దిరెడ్డి సత్యగోపాలకృష్ణ అధ్యక్షుడిగా, డైరెక్టర్లుగా పెన్నాడ రామకృష్ణ, బొక్కా అర్జునరావు, అయినాపురం పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఇందుకూరి పాండురంగరాజు, డైరెక్టర్లుగా కేతా వెంకటేశ్వరరావు, మెండి ఏడుకొండలు, రాణేలంక పీఏసీఎస్‌కు సంబంధించి అధ్యక్షుడిగా గోదశి పుండరీష్, డైరెక్టర్లుగా పళ్ల రామారావు, బొక్కా శ్రీనివాసరావులను ఎంపిక చేశారు.

**సహకార సంఘం అధ్యక్షుడు, డైరెక్టర్లకు సత్కారం**

స్థానిక పార్టీ కార్యాలయంలో విళ్ల వీరాస్వామినాయుడు అధ్యక్షతన సమావేశమైన నాయకులు ముమ్మిడివరం పీఏసీఎస్ అధ్యక్షుడిగా దొమ్మేటి రమణకుమార్‌ను, డైరెక్టర్లుగా నిమ్మకాయల విశ్వేశ్వరరావు, యలమంచిలి బాలరాజును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతనంగా ఎంపికైన అధ్యక్ష, డైరెక్టర్లను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొనగా నగర పంచాయతీ ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ, కడలి సౌజన్య, దాట్ల బాబు, కడలి నాగు, కట్టా సత్తిబాబు, మాదాల నాగసత్యమంగాకుమారి, సరిపెల్ల శ్రీనివాసరాజు, పిల్లి నాగరాజు, యాళ్ల ఉదయ్, గొల్లపల్లి గోపి, నిమ్మకాయల విస్సు, మెండి కమల, వాసంశెట్టి అమ్మాజీ, బొక్కా రుక్మిణి, సానబోయిన సోమయ్య, సరిపల్లి నాగరాజు, జగతా గోవిందరావు పాల్గొన్నారు.

### విద్యార్థులకు మోడల్ టెస్ట్ పేపర్లు పంపిణీ

రాజోలు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): పొన్నమండ జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు యూటీఎఫ్ రాజోలు మండల శాఖ ఆధ్వర్యంలో గోదావరి డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్, అప్పారి శ్రీనివాస్ సమకూర్చిన మోడల్ టెస్ట్ పేపర్లను విద్యార్థులకు సోమవారం అందజేశారు. దాతలను యూటీఎఫ్ రాజోలు మండల శాఖ సభ్యులు అభినందించారు. హెచ్ఎం ఎ.రోహిణి, ఉపాధ్యాయులు అభినందించారు.

# మండపేట







వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న దృశ్యం

## గోవింద నామస్మరణతో పులకించిన వాడపల్లి

ఆత్రేయపురం, జనవరి6 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం సోమవారం గోవింద నామస్మరణతో పులకించింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వేకువ జామునే స్వామివారికి గోదావరి జలాలను తీర్థపు బిందెతో తీసుకువచ్చి స్నపన మూర్తులకు అభిషేకం చేశారు. అనంతరం తిరుప్పావై వేదపారాయణం జరిపారు. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.2,74,264 వచ్చిందని ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

## మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంటులో కలపాలి

### మంత్రి సుభాష్‌కు సచివాలయాల ఏఎన్‌ఎంల వినతి



మంత్రి సుభాష్‌కు సమస్యలు తెలుపుతున్న ఏఎన్‌ఎంలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలను మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంటులో కలపాలని పలువురు ఏఎన్‌ఎంలు సోమవారం మంత్రి సుభాష్‌కు వినతిపత్రం ఇచ్చారు. తాము అన్ని రకాల నేషనల్ హెల్త్ కార్యక్రమాలు జరుపుతున్నామని వారు తెలిపారు. బుధ, శనివారాల్లో వ్యాధి నిరోధక కార్యక్రమం, శుక్రవారం డ్రైడే, ఫ్రైడే చేస్తున్నామని తెలిపారు. సచివాలయాల్లో కేస్ సర్వే, ఓడీఎఫ్ సర్వే వల్ల్ సర్వే వంటి సంబంధంలేని సర్వే లు అప్పగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయాల ఏఎన్‌ఎంలను పంచాయతీరాజ్, సచివాలయాల నుంచి వేరుచేసి మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంటులో కలపాలని కోరారు. బయోమెట్రిక్ ఎక్కడ వేసినా సెలవుదినాలు అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు ఆదినారాయణ, ప్రదీప, శ్రీలక్ష్మి, కెసత్యవేణి, పి.వరలక్ష్మి, వి.అన్నపూర్ణ, రత్నకుమారి, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఆర్తమూరులో వృక్షారామంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

## ఆర్తమూరులో భక్తి శ్రద్ధలతో వనారామం

మండపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఆర్తమూరు గ్రామంలోనున్న సత్యలక్ష్మ సప్తర్షి, నవగ్రహ వనారామం సోమవారం జరిగింది. తొమ్మిదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన వృక్షారామంలో ప్రతిరోజూ వృక్షారాధన, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆనవాయితీ చెందిన సురేష్‌శర్మ ఆధ్వర్యంలో సోమవారం వృక్షారామంలో గణపతి, నవగ్రహ హోమం చేశారు. సోమవారం జరిగిన వార్షికోత్సవంలో జరిగిన వృక్ష పూజల్లో ఆయా నక్షత్రాలకు సంబంధించిన వారు తమ నక్షత్రానికి చెందిన వృక్షాల వద్ద పూజలు చేశారు. ఈ నక్షత్ర వృక్షారామాను బుల్లి స్వామిరెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేయడం హర్షణీయమని భక్తులన్నారు. వార్షికోత్సవం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ అనంతరం మొక్కలను పంపిణీ చేశారు.

## నేటి నుంచి పాఠశాలల్లో ఫర్ల్ మిడ్‌లైన్ పరీక్షలు

కపిలేశ్వరపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 3, 4, 5 తరగతులు బోధిస్తున్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, విలీన ఉన్నత పాఠశాలల్లో మంగళ, బుధవారాల్లో టీచింగ్ ఎట్ రైట్ లెవెల్(తర్ల్) పరీక్షలు నిర్వహిస్తున్నట్టు సమగ్రశిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి పిరాబాబు తెలిపారు. సోమవారం మండలంలోని టేకి నం1 ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ 1,253 పాఠశాలల్లో 23,513 మంది విద్యార్థులకు బేస్ లైన్ టెస్ట్ నిర్వహించామన్నారు. విద్యార్థుల స్థాయిని అంచనా వేసేందుకు మంగళ, బుధవారాల్లో మిడ్‌లైన్ టెస్ట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తెలుగు లెవల్ మోడల్ స్కూల్స్‌ను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పీపీ-1, పీపీ-2 తరగతులు, ప్రాథమిక పాఠశాలలోని 1 నుంచి 5వ తరగతులను ఆయన పరిశీలించారు. జాయ్ పిటారా కిట్ ఆధారంగా 1, 2 తరగతులకు బోధన చేయాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు.



విద్యాస్థాయిని పరిశీలిస్తున్న సమగ్రశిక్ష ఏఎంవో రాంబాబు

## పెదపల్ల పీహెచ్‌సీలో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజు

ఆలమూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం పెదపళ్ల పీహెచ్‌సీలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీడీవో ఎ.రాజు సోమవారం పరిశీలించారు. ఓఎన్జీసీ ద్వారా రూ.10లక్షల నిధులు మంజూరు కావడంతో ఆసుపత్రికి వచ్చే రోగులకు ఇబ్బంది లేకుండా పలు అభివృద్ధి పనులు చేపట్టారు. సోమవారం ఎంపీడీవో ఎ.రాజు, పీహెచ్‌సీ వైద్యాధికారి సాయికిషోర్, మాజీ సర్పంచ్ గారపాటి త్రిమూర్తులు తదితరులు పరిశీలించారు. ఆసుపత్రికి కొంత నిలిచిపోయిన ప్రహరీ నిర్మాణానికి మండల పరిషత్ నిధుల నుంచి నిధులు మంజూరు చేయాలని ఎంపీడీవోను త్రిమూర్తులు కోరారు.

## రబీలో సాగునీటి కొరత లేకుండా చర్యలు

కె.గంగవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామని యర్రపోతవరం డీసీ అధ్యక్షుడు నిడదవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు చౌదరి అన్నారు. సోమవారం యర్రపోతవరం నుంచి పేకేరు శివారు నల్లచెరువు పుంతకు వెళ్లే కెనాల్‌లో పూడికతీత పనులను ఆయన ప్రారంభించారు. ఈ పనులతో యర్రపోతవరం, గుడిగళ్ళ, బాలంత్రం, పేకేరు, నల్లచెరువు పుంత గ్రామాల్లోని ఆయకట్టుకు సాగునీరు అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో నీల శ్రీనివాసు, చలగళ్ల నాగేశ్వరరావు, వానపల్లి వెంకట రమణ, మల్లిపూడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



యర్రపోతవరంలో పూడికతీత పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

## నేటి నుంచి విద్యుత్ నియంత్రణ మండలి ప్రజాభిప్రాయ సేకరణ

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి 2025-26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ ఈనెల 7, 8, 10వ తేదీల్లో చేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ డీఈఈ కె.రత్నాలరావు తెలిపారు. ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఏపీఈఆర్‌సీ ఛైర్మన్ జస్టిస్ ఠాగూర్ రామ్‌సింగ్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ విజయవాడ నుంచి వర్చువల్ విధానంలో జరుగుతుందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని అభిప్రాయాలు, అభ్యంతరాలు, సలహాలు చెప్పదలచుకున్నవారు రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం నుంచి పాల్గొనవచ్చని రత్నాలరావు తెలిపారు. ప్రతిరోజు ముందుగా నమోదు చేసుకున్న వారి అభ్యంతరాలు, సలహాలు తెలిపిన అనంతరం విద్యుత్ నియంత్రణ మండలి అనుమతితో ముందుగా నమోదు చేసుకోని వారు కూడా అభిప్రాయాలు తెలుపవచ్చని వారు అన్నారు. కార్యక్రమంలో ఏపీ ఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులు కూడా పాల్గొంటారని తెలిపారు.

## గట్టు బలహీనం..ప్రజల పాట్లు

**• ముంపుబారిన రజక కాలనీవాసులు • సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి**

కె.గంగవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): బ్యాంక్ కెనాల్ గట్టు బలహీనం కారణంగా పొలాలకు వెళ్లాల్సిన సాగునీరు కాలనీల్లోకి పోతోంది. సాధారణంగా వరదలు, భారీ వర్షాల సమయాల్లో లోతట్టు ప్రాంతాలు ముంపుబారిన పడుతుంటాయి. కానీ బ్యాంక్ కెనాల్ పరిధిలోని కోట గ్రామంలో కెనాల్ గట్టు బలహీనంగా ఉండటంతో పొలాలకు వెళ్లాల్సిన సాగునీరు స్థానిక రజక కాలనీకి వచ్చేస్తోంది. కోటమల్లి గుడి దగ్గర నుంచి రజకుల పేటలోకి వెళ్లే వీధి ముంపుబారిన పడింది. కోటిపల్లి లాకుల నుంచి దంగేరు, మసకపల్లి తదితర ప్రాంతాలకు సాగునీరు అందించడానికి ఇరిగేషన్ అధికారులు లాకుల వద్ద లెవెల్ మెయింటెన్ చేస్తున్నారు. లాకుల నుంచి కిందకు వెళ్లే బ్యాంకు కెనాల్ అక్రమాలకు గురి కావడం, కెనాల్‌లో తూటు పెరిగిపోయి సాగునీరు కిందకు వెళ్లకుండా ఎగదన్నడంతో కోట వద్ద బలహీనంగా ఉన్న గట్టు నుంచి రజక కాలనీకి నీరు వచ్చేస్తోంది. దీంతో కాలనీ ఆదివారం ముంపు బారినపడింది. ఇరిగేషన్ అధికారులు సమస్యను గుర్తించి బ్యాంక్ కెనాల్‌ను యుద్ధప్రాతిపదికన శుభ్రం చేయాలని స్థానికులు కోరుతున్నారు. గట్టును పటిష్ఠం చేసి సాగునీరు కింద పొలాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇకముందైనా ముంపు బారినపడకుండా రజక కాలనీని రక్షించాలని ప్రజలు, స్థానికులు కోరుతున్నారు.





కోటిపల్లి బ్యాంక్ కెనాల్‌కు కోట వద్ద బలహీనంగా ఉన్న గట్టు పక్క చిత్రంలో ముంపుబారిన పడిన రజక వీధి

## నేడు మండపేటలో సంక్రాంతి సంబరాలు

మండపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళ, బుధవారాలు సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా గంగిరెద్దులు, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, షటిల్ వంటి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు వీటిని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఆర్టీసీ డీఎంగా రమణ



రమణ

రావులపాలెం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్‌గా జీజీవీ రమణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పనిచేసిన డీఎం కుమార్ ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో రమణ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే బండారు సత్యానందరావును కలిశారు.

### జనార్దనస్వామి ఆలయాలు కిటకిట

కపిలేశ్వరపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కపిలేశ్వరపురం, మాచర, కోరుమిల్లి గ్రామాల్లోని జనార్దనస్వామి ఆలయాలు సోమవారం భక్తులతో పోటెత్తాయి. దనుర్మాసం సందర్భంగా నవ జనార్దనస్వామి ఆలయాల సందర్శనలో భాగంగా వైజాగ్, యానం పరిసర గ్రామాల భక్తులు స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

### నేడు మండలస్థాయి క్రీడా పోటీలు

కపిలేశ్వరపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): జడ్పీ ఉన్నత పాఠశాలల్లో మంగళ, బుధవారాలు మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని హైస్కూల్ హెచ్‌ఎంలు, హైస్కూల్ పీడీలకు ఎంఈవో కె.తాతారావు సమావేశం జరిపారు. ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 4, 5, 6 తరగతుల విద్యార్థులు జూనియర్స్ విభాగంలో, 7, 8, 9 తరగతుల విద్యార్థులు సీనియర్స్ విభాగంలో ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ బాలుర, బాలికలకు సెటిల్ బ్యాడ్మింటన్, 4, 5 తరగతుల విద్యార్థులకు, 6వ తరగతి విద్యార్థులకు రన్నింగ్ పోటీలు, అథ్లెటిక్స్ నిర్వహిస్తామన్నారు. 7, 8, 9 తరగతి విద్యార్థులకు సీనియర్స్ విభాగంలో మాత్రమే ఆటల పోటీలు నిర్వహిస్తామన్నారు. 7వ బాలురకు, 8వ బాలికలకు అన్ని క్రీడాంశాలు జరుగుతాయన్నారు. 9వ బాలుర క్రికెట్, మిగిలిన ఉన్న క్రీడాంశాలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

**మండపేట:** కోనసీమ క్రీడోత్సవాల్లో భాగంగా మండలంలో మండలస్థాయి క్రీడా పోటీలు మూడు రోజులపాటు నిర్వహిస్తున్నామని మండపేట పరిషత్ పరిపాలనాధికారి ప్రసాద్ తెలిపారు. ఐదో తరగతి నుంచి 9 వరకు చదువుతున్న విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్ ఉంటుందన్నారు. బాలికలకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్, 4, 5, 6 తరగతుల వారికి 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, త్రోబాల్ నిర్వహిస్తామన్నారు. ఈ పోటీ లను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రారంభిస్తారని తెలిపారు. ఎంపీపీ ఉండమట్ల వాసు, ఎంపీటీసీలు, సర్పంచులు హాజరవుతారన్నారు.

**రాయవరం:** ఈనెల 7, 8, 9 తేదీల్లో పాఠశాల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో పిరాలక్ష్మణమూర్తి, వైనూర్యనారాయణ తెలిపారు. కోనసీమ క్రీడోత్సవాల్లో భాగంగా రాయవరం శ్రీరామయ్య ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 9.30 నుంచి పోటీలు ప్రారంభించనున్నారని ఏర్పాట్లు చేశామన్నారు.

### ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్

(ద్రాక్షారామ), జనవరి 6(ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ద్రాక్షారామ ఎస్‌ఐ ఎం.లక్ష్మణ్ ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు యూనిఫారం ధరించి అన్ని పత్రాలు దగ్గర ఉంచుకోవాలన్నారు. చట్టబద్దం కాని వస్తువులు రవాణా చేయవద్దని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఆటోడ్రైవర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సంక్రాంతి సంబరాలను విజయవంతంగా నిర్వహించాలి

### గోదావరి ట్రోఫీ ఏర్పాట్లు పరిశీలించిన ఆర్డీవో



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీకర్

ఆత్రేయపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ఆత్రేయపురం ప్రధాన కాలువలో సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ పోటీలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వ చర్యలు చేపట్టిందని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ పేర్కొన్నారు. సోమవారం లొల్ల లాకుల నుంచి ఉచ్చిలి వరకు నిర్వహించే పోటీ ప్రదేశాలను ఆయన పరిశీలించారు. లొల్ల లాకులు, ఉచ్చిలి వద్ద పార్కింగ్ ప్రదేశాలు, పడవ, ఈత పోటీలు జరిగే ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. సమయం దగ్గర పడుతోందని వీటి ఏర్పాట్లు చురుకుగా నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్, ఆర్‌అండ్‌బీ మణికుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 'అవినీతిలో జగ్గిరెడ్డి పీహెచ్‌డీ చేశారు'

### ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



మ్యాప్ చెందిన యువకుల ఫోటోలు చూపిస్తున్న ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో కొత్తపేట నియోజకవర్గంలో అవినీతి, అక్రమాలు, దోపిడీల్లో పీహెచ్‌డీ చేసిన మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి నీతులు మాట్లాడటంతో మాటలతో సరిపోవని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందించడాన్ని ఓర్వలేక జగ్గిరెడ్డి విమర్శలు చేస్తున్నారన్నారు. ఉచిత ఇసుక పేరిట అన్యదమ్ములు దోపిడీకి పాల్పడుతున్నారు అనడాన్ని ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించేస్థాయి జగ్గిరెడ్డికి లేదన్నారు. ఇప్పటికైనా తప్పుడు ఆరోపణలు మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు చిలువూరి సతీష్‌రాజు, గుత్తుల పట్టాభిరామారావు, కరుటూరి నరసింహారావు, కంఠంశెట్టి శ్రీనివాస్, దర్శూల రామకృష్ణ, జక్కంపూడి వెంకటస్వామి, ముత్యాల బాబ్జీ, కేతా శ్రీను, సిద్ధిరెడ్డి శ్రీను, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## సంప్రదాయాలు ప్రతిబింబించేలా సంక్రాంతి సంబరాలు

### మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా రామచంద్రపురంలో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్టు మంత్రి సుభాష్ తెలిపారు. సోమవారం సంక్రాంతి ఉత్సవ్ 2k25 పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ వీఎస్‌ఎం కళాశాలలో ఈనెల 12 నుంచి 14 వరకు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తామన్నారు. మహిళలకు 11న ముగ్గుల పోటీలు జరుపుతామన్నారు. 12, 13, 14 తేదీల్లో అంబరాన్నంటేలా సంక్రాంతి సంబరాలు ఉంటాయన్నారు. ఈనెల 12న బోగిమంటలతో ప్రారంభమై మహిళలకు ముగ్గుల పోటీలు, యువతీ, యువకులకు సంగీత విభావరి వంటి పలు కార్యక్రమాలు ఉంటాయన్నారు. కూటమి పార్టీల మహిళా నాయకులు, కార్యకర్తలు వీటి ఏర్పాట్లు పర్యవేక్షిస్తారని తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

## గంగవరం రహదారి పనులు ప్రారంభం

కె.గంగవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ - గంగవరం రహదారిలో గంగవరం టేకి డ్రైన్ వంతెనకు ఇరువైపులా రోడ్డు అధ్వానంగా ఉన్న విషయం విదితమే. గత ప్రభుత్వం ఈ రహదారిని నిర్లక్ష్యంగా వదిలేయడంతో పెద్ద గోతులు ఏర్పడ్డాయి. తరచూ వాహనదారులు ప్రమాదాల బారినపడి ఆసుపత్రుల పాలయ్యారు. ఐతేఎల కూటమి ప్రభుత్వం గుంతలు పూడ్చే పనులు చేపట్టిన నేపథ్యంలో మంత్రి సుభాష్ ఈ రోడ్డులో గుంతలు పూడ్చే పనులు ప్రారంభించారు. తదనంతరం చాలా గ్యాప్ రావడంతో రోడ్డు పనులు జరుగుతాయా అని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేశారు. ఎట్టకేలకు సోమవారం రహదారిలో మరమ్మతులు చేపట్టడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రవికుమార్

## ఆటోడ్రైవర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

కపిలేశ్వరపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలకు అనుగుణంగా ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చాలని అంగర ఎస్‌ఐ డి.రవికుమార్ అన్నారు. సోమవారం అంగర సెంటర్ నుంచి ఆటో యూనియన్ నాయకులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వాహనాలు నడిపే సమయంలో ఆటో డ్రైవర్లు మద్యం సేవించి వాహనం నడపరాదని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయవద్దని సూచించారు. వాహనాలకు సంబంధించిన అన్ని రికార్డులు ఉండాలన్నారు. ప్రతి వాహనానికి ఇన్సూరెన్స్ చేయించాలని, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. ప్రభుత్వ రూల్స్ ను పాటించడంతో పాటు యూనిఫాం ధరించాలని ఎస్‌ఐ తెలిపారు.

## సంక్రాంతి అంటే సంస్కృతి, సంప్రదాయాల సంగమం

కొత్తపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి అంటే తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు చిహ్నమని కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ రాజు అన్నారు. సోమవారం కళాశాలలో విద్యార్థులతో సంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వస్త్రధారణ పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రవిచంద్, సీహెచ్ నాగరాజు, సీహెచ్ చేవన్ శ్రీలక్ష్మి, సీహెచ్, భవాని, డి.కావ్య తదితరులు పాల్గొన్నారు.



సంప్రదాయ పోటీల్లో పాల్గొన్న వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులు

### కోడిపందేల శిబిరంపై దాడి

ఆత్రేయపురం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ర్యాలి శివారు ప్రాంతంలో సోమవారం కోడిపందేలు నిర్వహిస్తున్న శిబిరంపై ఎస్‌ఐ రాము ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు జరిపారు. కోడిపందేలు ఆడుతున్న ఆరుగురితోపాటు రెండు పుంజులు, కత్తులు, రూ.3100 నగదు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆలమూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఆలమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కొన్ని గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రామచంద్రపురం ఈఈ కె.రత్నాలరావు తెలిపారు. ఆలమూరు సబ్‌స్టేషన్ పరిధిలోని మూలస్థానం, జొన్నాడ, గ్రామాల్లో ఇండస్ట్రియల్ లైన్ పనులు చేపడుతున్న కారణంగా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

### సీఐగా సురేష్ బాధ్యతల స్వీకరణ



సీఐ సురేష్

మండపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండపేట సీఐగా దారం సురేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన అలీజాన్ ఎన్నికల తర్వాత వీఆర్‌లోకి వెళ్లటంతో అప్పటి నుంచి సీఐ పోస్టు ఖాళీగా ఉంది. ఇప్పటి వరకు రూరల్ సీఐ పి.దొరరాజు ఇన్‌ఛార్జిగా వ్యవహరించారు. బదిలీపై వచ్చిన సురేష్ విజయవాడలో పనిచేశారు. ఎన్నికల సమయంలో సామర్లకోటలో పనిచేశానని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన సీఐని ఎస్‌ఐ హరికోటశాస్త్రి, పలువురు సిబ్బంది స్వాగతం పలికారు.

### ఎంవీఐగా లక్ష్మీశ్రీదేవి



ఎంవీఐ లక్ష్మీశ్రీదేవి

**మండపేట:** రవాణాశాఖ మోటారు వెహికల్ అధికారిణిగా ఎన్.లక్ష్మీశ్రీదేవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన అధికారి బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఈమె నియమితులయ్యారు. ఇప్పటి వరకు రాజమహేంద్రవరం రవాణా శాఖ కార్యాలయంలో పనిచేసి బదిలీపై వచ్చారు. మండపేట, కపిలేశ్వరపురం, ఆలమూరు మండలాలకు సంబంధించిన వాహనదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

### నేడు ఏడిదలో త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవం

మండపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ఏడిద-మోడుకూరు రోడ్డులో వున్న అంజనేయస్వామి ఆలయం వద్ద త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు నేడు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం వరకు జరిగే ఉత్సవాల్లో రాష్ట్రం నుంచి సుమారు 500 మంది కళాకారులు హాజరవుతున్నారని తెలిపారు. నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హాజరవుతారని నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు వి.సూర్యనారాయణ తెలిపారు.

### డివిజనల్ ఆరోగ్య అధికారిణికి వినతిపత్రం

(ద్రాక్షారామ), జనవరి 6(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం డివిజనల్ ఆరోగ్య అధికారిణి డాక్టర్ ఎస్.ప్రసాదినికి రామచంద్రపురం మండలం సచివాలయాల ఏఎన్‌ఎంలు వినతిపత్రం ఇచ్చారు. ద్రాక్షారామ పీహెచ్‌సీలో డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. కార్యక్రమంలో నరాల రాజ్యలక్ష్మి, విత్తనాల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

### సాయిప్రసాద్‌కు మంత్రి పరామర్శ

రామచంద్రపురం(ద్రాక్షారామ),జనవరి 6(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ వీసీపర్సన్, 26వ వార్డు కౌన్సిలర్ వాడ్రేవు సాయిప్రసాద్, ఉపాధ్యాయ సంఘం నాయకుడు వాడ్రేవు శ్రీనివాసులను సోమవారం మంత్రి సుభాష్ పరామర్శించారు. ఇటీవల సాయిప్రసాద్ తల్లి సుబ్బలక్ష్మి మృతి చెందిన సంగతి తెలిసిందే. దీంతో వారి కుటుంబీకులను పరామర్శించారు. మంత్రి వెంట అంకం శ్రీనివాస్, టీడీపీ నాయకులు దంగేటి గౌరీశంకర్, అల్లం శ్రీను, గడి గోవింద తదితరులు ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

### రీసర్వే రద్దు చేయాలి

#### రెవెన్యూ సదస్సులో రైతుల వినతి

ఆలమూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో జరిగిన రీసర్వే వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తక్షణం దాన్ని రద్దు చేయాలని రెవెన్యూ సదస్సులో పలువురు రైతులు వినతిపత్రం ఇచ్చారు. రీసర్వే రద్దు చేసి పాత విధానంలో పాస్‌పుస్తకం, డాక్యుమెంట్లలో ఉన్న భూమిని రైతులకు వచ్చేలా చేయాలని వినతిపత్రంలో కోరారు. రీసర్వే వల్ల నష్టపోయిన వారికి రిజిస్ట్రేషన్ల ఇబ్బందిగా మారిందని వారన్నారు. రీసర్వేలో ఉన్న లోపాలను సవరించాలని కోరుతూ కరెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదులు చేసే సబ్‌డివిజన్ చేయించుకోవాలని కోరుతున్నారని అందరికీ భూమి తక్కువ వస్తే సబ్‌డివిజన్ వల్ల ప్రయోజనం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతులు ఈదల సత్తిబాబు, ఈదల నల్లబాబు, నెక్కంటి సూర్యనారాయణ తదితర రైతులు రెవెన్యూ అధికారులకు వినతిపత్రం ఇచ్చారు.